ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
తూర్పుగోదావరి
జిల్లా వార్తలు
శనివారం 29 నవంబరు 2025 | 5



సది విద్యార్థులను నూరుదాం!

» 100 రోజుల పార్య ప్రణాళిక కచ్చితం
» 5న మెగా టీచర్స్-పేరెంట్స్ మీట్ : కలెక్టర్

రాజమహేంద్రవరం, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి) : పదో తరగతి పబ్లిక్ పరీక్షల్లో అత్యుత్తమ ఫలితాలు సాధించడానికి ప్రభుత్వం రూపొందించిన 100 రోజుల కార్యాచరణ ప్రణాళికను పకడ్బందీగా అమలు చేయాలని కలెక్టర్ కీర్తి చేకూరి ఆదేశించారు. జిల్లా విద్యా శాఖ పని తీరుపై శుక్రవారం ఆమె సమీక్షించారు. తరగతుల వారీగా విద్యార్థుల అభ్యసన స్థాయిలను ఉపాధ్యాయులు విశ్లేషించాలన్నారు. ఏ,బీ గ్రేడుల్లోని వాళ్ల మెరుగుపడే విధంగా ప్రోత్సహించాలని.. సీ,డీ గ్రేడ్‌ల వాళ్లపై ప్రత్యేక దృష్టి సారించాలని చెప్పారు. ప్రతి విద్యార్థికి ఏపీఏఏఆర్ ఐడీ కార్డు తప్పనిసరిగా ఉండాలన్నారు. ఆధార్ ఆధారిత విద్యార్థి వివరాల అప్‌డేట్‌ని వేగవంతం చేయాలని ఆదేశించారు. జిల్లాలోని 1,684 పాఠశాలల్లోని 3,13,958 మంది విద్యార్థుల్లో ఇప్పటి వరకూ 2,86,311 మందికి అప్‌డేట్ పూర్తయిందన్నారు. అందరి వివరాలను అప్‌డేట్ చేయడానికి గ్రామ/వార్డు సచివాలయాల వెల్ఫేర్, డిజిటల్ అసిస్టెంట్లు తదితర సిబ్బందిని సమన్వయంతో వినియోగించాలని సూచించారు. డిసెంబరు 5న ప్రతి పాఠశాల పరిధిలో మెగా పేరెంట్స్ టీచర్స్ మీట్(పీటీఎం) 3.0ని నిర్వహించాలని ఆదేశించారు. పాఠశాల పురోగతికి తల్లిదండ్రుల భాగస్వామ్యం కీలకమన్నారు.తల్లిదండ్రులు తమ పిల్లలతో కలిసి తరగతుల్లో కూర్చునే విధంగా సీటింగ్ ఏర్పాటు చేయా లని సూచించారు. కార్యక్రమంలో డీఈవో వాసుదేవరావు, ఎస్ఎస్ఏ పీడీ సుభాషిణి, డిప్యూటీ డీఈవో దిలీప్ కుమార్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జిల్లా వ్యవసాయాధికారి మాధవరావు

పోలవరం ప్రాజెక్టు అనుబంధ పనులకు రూ. 542 కోట్లు

రాజమహేంద్రవరం, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి) : పోలవరం ప్రాజెక్టుకు ఇరువైపులా రోడ్ల నిర్మాణానికి రూ. 542.85 కోట్లు కేటాయించారు. రాజధానిలో శుక్రవారం సీఎం చంద్రబాబు నాయుడు అధ్యక్షన జరిగిన కేబినెట్ సమావేశం ఆమోదం తెలిపింది. ఇరిగేషన్ శాఖ ద్వారా కేటాయించిన ఈ నిధులతో పోలవరం గ్రామం నుంచి స్పిల్‌వే వరకూ అనుసంధాన రహదారులు నిర్మిస్తారు. తూర్పుగోదావరి జిల్లా వైపు ప్రాజెక్టు నుంచి ఎడమ ప్రధాన కాలువ (ఎల్ఎంసీ) వద్దకు గ్యాప్-1ను కలుపుతూ రోడ్డ నిర్మాణం చేస్తారు. వీటికి రూ.217.55 కోట్లు కేటాయించారు. గండిపోచమ్మ గుడి, హెడ్ రెగ్యులేటర్, నావిగేషన్ టన్నెల్ చివర కెఎల్ బండ్‌కు కలిపే పనులు చేస్తారు. అంగుళూరు, పురుషోత్తపట్నం, రామచంద్రపురం గండిపోచమ్మగుడి వరకూ ఏజీ ఎల్‌బీ రక్షణ పనులు చేస్తారు.వరద నష్ట నివారణ చర్యల్లో భాగంగా పనులన్నింటినీ ప్రభుత్వం ఆమోదించింది.

ఉగాది నాటికి టిడ్కో ఇళ్లు..

మునిసిపల్ కార్పొరేషన్లు, మునిసిపాలిటీల పరిధిలో ఇళ్లను నిర్మించుకునే సమయంలో ఖాళీ స్థలాల పన్నులు 50 శాతం తగ్గించడానికి కేబినెట్ నిర్ణయం తీసుకుంది. ఉగాది నాటికి టిడ్కో ఇళ్లను కూడా అప్పగించాలని నిర్ణయించింది.

పీఎంఏవై 2.0 సర్వేలో 16,335 మంది గుర్తింపు

రాజమహేంద్రవరం, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి) : ప్రధానమంత్రి ఆవాస్ యోజన- గ్రామీణ 2.0 కింద ఇళ్లులేని పేదల గుర్తింపునకు చేసిన సర్వే ఇప్పటికే 100 శాతం పూర్తయిందని జిల్లా కలెక్టర్ కీర్తి చేకూరి శుక్రవారం తెలిపారు.ఈ మేరకు శుక్రవారం రాత్రి ఒక ప్రకటన విడుదల చేశారు. జిల్లాలో 16,335 మందిని అర్హులుగా గుర్తించామన్నారు. ఈ నెల 30వ తేదీ వరకూ ఎవరైనా అర్హులుంటే హౌసింగ్ ఏఈ, సచివాలయ ఇంజనీరింగ్ అసిస్టెంట్ల ద్వారా నమోదు చేసుకోవాలన్నారు. పక్కా ఇల్లు లేనివారు, గతంలో ఏ గృహ పథకంలోనూ లబ్ధిపొందని వారు మాత్రమే అర్హులన్నారు.

భార్య చీరతో.. భర్త ఉరి

రాజమహేంద్రవరం, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): భార్య పుట్టింటికి వెళ్లిపోవడంతో మనస్తాపంతో భర్త ఆమె చీరతోనే ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. నగరంలోని పీఅండ్‌టీ కాలనీలో కుటుంబంతో నివాసం ఉంటున్న దొడ్డిపట్ల విజయ శేఖర్(42) పేపర్ మిల్లులోని ప్రైవేటు ఉద్యోగిగా పని చేస్తున్నాడు.శేఖర్‌కి ఎనిమిదేళ్ల కిందట వివాహం కాగా ఇద్దరు పిల్లలున్నారు. భర్త మద్యానికి బానిసై కుటుంబాన్ని నిర్లక్ష్యం చేయడంతో విసిగిపోయిన భార్య రెండు నెలల కిందట పిల్లలను తీసుకొని పుట్టింటికి వెళ్లిపోయింది.దీంతో తీవ్రంగా మనస్తాపం చెందిన శేఖర్ గురువారం రాత్రి బాగా తాగొచ్చి భార్య చీరతో ఉరేసుకున్నాడని పోలీసులు భావిస్తున్నారు. శుక్రవారం ఉదయం మృతుడి తండ్రి వెంకయ్య గమనించి పోలీసులకు సమాచారం ఇచ్చాడు.ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని త్రీటౌన్ సీఐ అప్పారావు తెలిపారు.



టిడ్కో డబ్బులిస్తారా!

పేదింట తీరని కలత

లక్ష కట్టండి.. సొంతింట్లో దిగండి.. ఇదీ గత టీడీపీ ప్రభుత్వంలో టిడ్కో లబ్ధిదారులకు ఇచ్చిన భరోసా.. చాలా మంది పేదలు అప్పులు చేసి మరి రూ.లక్ష చొప్పున కట్టారు. అయితే 2019లో టీడీపీ ఓటమిపాలవడంతో టిడ్కో ఇళ్లు ఎక్కడికక్కడే నిలిచిపోయాయి. అనంతరం వైసీపీ అధికారంలోకి రావడంతో పలువురి ఇళ్లను రద్దు చేసేసింది. అయితే ముందు చెల్లించాల్సిన రూ.లక్ష మాత్రం ఏ ఒక్కరికీ చెల్లించలేదు. దీంతో లబ్ధిదారులు ఐదేళ్లుగా సొమ్ము వెనక్కు రాక ఈసురోమంటున్నారు. అప్పులు చేసి కట్టిన డబ్బులు ఇవ్వకుండా ఎన్నాళ్లు ఏడిపిస్తారంటూ కలెక్టరేట్ల చుట్టూ కాళ్లరిగేలా తిరుగుతున్నారు. గత వైసీపీ ప్రభుత్వ నిర్వాకంతో తమకు ఇన్ని ఇబ్బందులు ఎదురవుతున్నాయని.. ప్రస్తుత ప్రభుత్వమైనా కరుణించాలంటూ గ్రీవెన్స్ సెల్‌లో దరఖాస్తులు చేస్తున్నారు. అయినా డబ్బుల సంగతి తేలకపోవడంతో అయోమయంలో ఉన్నారు.

- (కాకినాడ,ఆంధ్రజ్యోతి)

» వైసీపీలో టిడ్కో నిధులు మళ్లింపు
» ఇళ్లు రద్దు చేసినా చెల్లింపుల్లేవ్
» ఐదేళ్లుగా లబ్ధిదారుల ఎదురుచూపులు
» అయోమయంలో రూ.10.52 కోట్లు
» ఎంపీ, ఎమ్మెల్యేలకు విన్నపాలు
» అయినా ఫలించని వైనం

ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా టిడ్కో ఇళ్లు రద్దయిన వారి డబ్బులు రూ.10.20 కోట్ల మేర పేరుకుపోయాయి. ఆ రిఫండ్ డబ్బులు వస్తాయో రావో అన్నట్టుగా పరిస్థితి మారింది. నిధుల విడుదలకు ఆయా మునిసిపాలిటీల వారీగా ఎమ్మెల్యేలు సైతం ప్రయత్నం చేస్తున్నా అమరావతిలో టిడ్కో ఉన్న తాధికారులు మాత్రం ఉలుకు పలుకు లేకుండా ఉన్నారు. కాకినాడ కార్పొరేషన్ పరిధిలో రూ.6.53 కోట్లు, రామచంద్ర పురం రూ.1.20 కోట్లు, పెద్దాపురం రూ.59.28 లక్షలు, మండపేట రూ.42 లక్షలు, కొవ్వూరు, నిడదవోలు మునిసిపాలిటీల్లో 21 లక్షల చొప్పున రిఫండ్ డబ్బులు పేరుకుపోయాయి.

టీడీపీ ఇస్తే..వైసీపీ వచ్చి లాగేసుకుంది..

2014లో అధికారంలోకి వచ్చిన అప్పటి టీడీపీ ప్రభుత్వం పట్టణాలు, నగరాల్లో నివసించే పేదల కోసం టిడ్కో ఇళ్లు నిర్మించాలని నిర్ణయించింది. ఈ మేరకు 2017-2019 మధ్య లబ్ధిదారులను ఎంపిక చేసింది. టిడ్కో ఇళ్ల కోసం ఆయా మునిసిపాలిటీలకు లబ్ధిదారుడి వాటాగా రూ.లక్ష, రూ.50 వేలు, రూ.25వేల చొప్పున చెల్లించారు. 2019లో వైసీపీ ప్రభుత్వం రాగానే టీడీపీ ప్రభుత్వం నిర్మించిన టిడ్కో ఇళ్లపై కత్తి కట్టింది. పేదలకు ఇవ్వకుండా నిలిపివేసింది. వేలాది మందికి మంజూరైన టిడ్కో ఇళ్లను రద్దు చేసేసింది. ఈ మేరకు లబ్ధిదారులకు అంతకు ముందు వారు చెల్లించిన మొత్తాన్ని వెనక్కు ఇవ్వాల్సి ఉంది. కానీ అప్పటి వైసీపీ ప్రభుత్వం ఆ డబ్బులను అప్పటికే మునిసిపాలిటీల నుంచి టిడ్కోలో ప్రత్యేక ఖాతాకు మళ్లించేసి వాడేసుకుంది. దీంతో లబ్ధిదారులు ఎంత మొత్తుకున్నా వారి డబ్బులను వెనక్కివ్వలేదు. చివరకు ఇప్పటికి ఐదేళ్లవుతున్నా ఏ ఒక్కరికీ డబ్బులు రిఫండ్ రాక వారంతా లబోదిబోమంటున్నారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా రూ.10.20 కోట్ల వరకు పేరుకుపోయాయి.

ఎక్కడెక్కడ ఎంత ఇవ్వాలంటే..

కాకినాడ కార్పొరేషన్ పరిధిలో రూ.6.53 కోట్లు రిఫండ్ డబ్బులు వెనక్కు రాక లబ్ధిదారులు నెత్తీ నోరు బాదుకుంటున్నారు. రూ.లక్ష చొప్పున 589 మందికి, రూ.25 వేల చొప్పున 150 మందికి, రూ.50 వేల చొప్పున 448 మందికి డబ్బులు రాలేదు. అప్పట్లో కార్పొరేషన్ పరిధిలో 2,056 టిడ్కో ఇళ్లు నిర్మించారు. సైట్-ఏలో 1,152 ఇళ్లు, సైట్-బీలో 904 ఇళ్లు నిర్మించారు. వీటికి సంబంధించి ఇళ్లు మంజూరై ఆనక రద్దయిన, రద్దు చేసుకున్న లబ్ధిదారులకు రూ.6.53 కోట్లు వెనక్కు రాలేదు. సామర్లకోట మునిసిపాలిటీ పరిధిలో 1,056 ఇళ్లు నిర్మించగా వీటిలో రద్దు చేసుకున్న వారికి రూ.25 లక్షలు వెనక్కు రావాల్సి ఉంది. ఇందులో రూ.లక్ష చొప్పున 33 మందికి రావాల్సి ఉంది. పెద్దాపురం మునిసిపాలిటీలో 3,312 ఇళ్లు నిర్మించగా రద్దు చేసుకున్న వారికి రూ.59.28 లక్షలు ఐదేళ్ల నుంచీ వెనక్కు రావడం లేదు. వీరిలో రూ.లక్ష చొప్పున చెల్లించిన వారు 55 మంది, రూ.50 వేల చొప్పున చెల్లించిన వారు 106 మంది ఉన్నారు. పిఠాపురంలో 864 టిడ్కో ఇళ్లు నిర్మించగా రూ.10 లక్షలు ఇంకా వెనక్కు రాలేదు. రామచంద్రపురం మునిసిపాలిటీలో లబ్ధిదారులకు రూ.1.20 కోట్లు రావాల్సి ఉంది. వీరిలో రూ.లక్ష చొప్పున చెల్లించిన వారు 92 మంది ఉన్నారు. మండపేట మునిసిపాలిటీలో రూ.42 లక్షలు, అమలాపురం మునిసిపాలిటీ రూ.40 లక్షలు రావాల్సి ఉంది. తూర్పుగోదావరి జిల్లా నిడదవోలు, కొవ్వూరు మునిసిపాలిటీల పరిధిలో రూ.21 లక్షల వరకు రావాల్సి ఉంది.

వస్తాయా..రావా..

లబ్ధిదారులకు వెనక్కు ఇవ్వాల్సిన డబ్బులను అప్పటి వైసీపీ ప్రభుత్వం అడ్డగోలుగా వాడేసుకుంది. దీంతో రిఫండ్ డబ్బులు ఎవరికీ రాలేదు. ప్రభుత్వం మారిన తర్వాత అనేక మంది బాధితులు ప్రతి సోమవారం పీజీఆర్ఎస్‌కు వచ్చి కలెక్టర్లకు వినతి పత్రాలు ఇస్తున్నారు. తమ డబ్బులు తమకు ఇప్పించాలని కాళ్లరిగేలా తిరుగుతున్నారు. ఎమ్మెల్యేలు, ఎంపీల వద్దకు సైతం లబ్ధిదారులు తిరుగుతున్నా పనవడం లేదు. ఈ నిధులు లబ్ధిదారులకు వెనక్కివ్వాలని కలెక్టర్లు,ఎమ్మెల్యేలు సైతం టిడ్కోకు లేఖలు రాసినా ఎలాంటి ప్రయోజనం లేదు. తమ వద్ద ఆ నిధులు లేవని అక్కడి అధికారులు సమాధానం చెబుతున్నారు. దీంతో రిఫండ్ డబ్బులపై అయోమయం నెలకొంది.ఇటీవల కాకినాడకు వచ్చిన జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి నారాయణ దృష్టికి అధికారులు ఈ విషయాన్ని తీసుకెళ్లారు. అయితే ప్రభుత్వం దృష్టికి మరోసారి తీసుకువెళ్తానని పేర్కొన్నారు.

వ్యవసాయం మార్చండి

జిల్లా వ్యవసాయాధికారి మాధవరావు

రాజమహేంద్రవరం రూరల్, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి) : రైతుల వ్యవసాయంలో నూతన సాంకేతిక పరిజ్ఞానం ఉపయోగించి నాణ్యమైన, అధిక దిగుబడులు సాధించాలని జిల్లా వ్యవసాయాధికారి మాధవరావు అన్నారు. రూరల్ మండలం కొంతమూరులో నిర్వహించిన రైతన్న మీ కోసం కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. నీటి భద్రత, డిమాండ్ ఆధారిత పంటలు, వ్యవసాయ సాంకేతికత, ఫుడ్ ప్రోసెసింగ్ వంటి విషయాలపై అవగాహన కల్పించారు. నూతన వరి రకాలైన ఎంటియూ 1426, ఎస్ఎల్ఆర్ 3648 రకాలను వేసుకోవాలని శ్రీనివాస్ తెలిపారు. గోరంట్ల రవి రామ్ కిరణ్ మాట్లాడుతూ ప్రభుత్వ సంక్షేమ పథకాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు.ఈ కార్యక్రమంలో ఏరువాక కేంద్రం కోఆర్డినేటర్ చల్లా వెంకటనరసింహరావు, ఏడీఏ సూర్యరమేష్ ,వ్యవసాయ శాఖ అధికారులు పాల్గొన్నారు.



ఎంపీ పురందేశ్వరికి వినతిపత్రం అందజేస్తున్న టీచర్లు

టీచర్లను టెట్ నుంచి మినహాయించాలి

ఎంపీ పురందేశ్వరికి ఉపాధ్యాయుల వినతి

రాజమహేంద్రవరం అర్బన్, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి) : సీనియర్ ఉపాధ్యాయులను టెట్ పరీక్ష నుంచి మినహాయించాలని యూటీఎఫ్ సంఘం నేతలు రాజమండ్రి ఎంపీ దగ్గుబాటి పురందేశ్వరిని కోరారు.ఈ మేరకు శుక్రవారం యూటీఎఫ్ జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు పి.జయకర్, ఏ.షరీఫ్ ఆధ్వర్యంలో రాజమహేంద్రవరంలోని పలుకు కేంద్రం వద్ద ఎంపీని కలిసి వినతిపత్రం అందజేశారు. విద్యాహక్కు చట్టం ప్రకారం ఉపాధ్యాయులంతా విధిగా టెట్ పాస్ అవ్వాలని ఇటీవల సుప్రీం కోర్టు తీర్పునిచ్చిందని తెలిపారు. 20, 30 సంవత్సరాలు పైబడి సర్వీస్ చేసిన ఉపాధ్యాయులు ఇప్పుడు మళ్లీ టెట్ రాయాలనే నిబంధన ఇబ్బందికరంగా ఉందని, సవరించడానికి తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. దీనిపై ఎంపీ పురందేశ్వరి స్పందిస్తూ ఈ విషయంపై చర్చించి పార్టీ నిర్ణయం మేరకు తగిన చర్య తీసుకుంటామన్నారు.ఈ కార్యక్రమంలో యూటీఎఫ్ కోశాధికారి ఈవీఎస్ఆర్.ప్రసాద్, జిల్లా కార్యదర్శి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

పల్లె దారులకు పండగ!

» పల్లెపండుగ 2.0 సందడి
» రూ.54 కోట్లతో రూ.267 సీసీ రోడ్లు
» వచ్చే ఏడాది మార్చి 31నాటికి పూర్తి
» గ్రామాల్లో పనులు ఆరంభం

(రాజమహేంద్రవరం- ఆంధ్రజ్యోతి)

పల్లెపండుగ 2.0 సందడి మొదలైంది. పల్లెల్లో ప్రతీ వీధిలోనూ రోడ్లు నిర్మించాలనే లక్ష్యంతో గతేడాది అక్టోబరులో మొదటి విడత పనులు జరిగిన సంగతి తెలిసిందే. గత వైసీపీ ప్రభుత్వం రోడ్లను నిర్లక్ష్యం చేయడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. తెలుగుదేశం కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత సీఎం చంద్రబాబు నాయకత్వంలో రోడ్ల నిర్మాణ పనుల్లో కదలిక వచ్చింది. పల్లె పండుగ పేరుతో ఉపాధి హామీ పథకం నిధులతో పనులు చేస్తున్నారు. రెండో విడత పల్లె పండుగ పనులను డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ ఈ నెల 26న కోనసీమలో ప్రారంభించారు. ఈ ఏడాది రూ.54 కోట్లతో 267 పనులు చేయనున్నారు.ఈ మేరకు పనులు ఆరంభమయ్యాయి. మార్చి నెలాఖరుకి పనులు పూర్తి చేయనున్నారు. వాస్తవానికి ప్రభుత్వం రూ.152 కోట్ల విలువైన పనులను మంజూరు చేసింది. కానీ ఉపాధి హామీ నిధులు తక్కువగా ఉండడంతో ప్రస్తుతం రూ.54 కోట్లతో 76 కిలోమీటర్ల మేర పనులు చేస్తున్నారు.ఇవన్నీ సీసీ రోడ్లే. కనీసం మూడు మీటర్ల నుంచి అంటే 10 అడుగుల నుంచి 12 అడుగుల రోడ్ల వరకూ సీసీ రోడ్ల నిర్మాణం సాగుతోంది. కొన్ని ప్రాంతాల్లో ప్రాధాన్యతను బట్టి 17 నుంచి 18 అడుగుల వెడల్పు రోడ్లు నిర్మించనున్నారు.కనీసం రోడ్డు నిర్మాణ అంచనా రూ.10 లక్షల నుంచి ఆరంభమవుతుంది. ఒక్కో నియోజకవర్గంలోనూ 9 కోట్ల విలువైన 45 నుంచి 50 పనులు పనులు జరగనున్నాయి. గ్రామ పంచాయతీ తీర్మానంతో మండల పరిషత్ కార్యాలయంలో రిజిస్టర్ చేసుకున్న కాంట్రాక్టర్లు ఈ పనులు చేయనున్నారు. పంచాయతీ తీర్మానం తప్పనిసరి అవుతుంది.ఇప్పటికే జిల్లావ్యాప్తంగా అన్ని ప్రాంతాల్లోనూ కొన్ని పనులు ఆరంభించారు. గాడాల నుంచి పాలచర్ల రోడ్డు 1600 మీటర్ల పొడవున రూ.కోటి 4 లక్షలతో నిర్మాణ పనులు చేస్తున్నారు. ఇవన్నీ మార్చి నెలాఖరుకి పూర్తవుతాయని అధికారులు చెబుతున్నారు. గతేడాది రూ.67 కోట్లతో 149 పనులు చేసిన సంగతి తెలిసిందే. వీటికి సంబంధించిన బిల్లులు ఇటీవలే క్లియర్ చేశారు. సుమారు రూ.4 కోట్ల నుంచి రూ. 5 కోట్ల వరకూ బిల్లులు పెండింగ్ ఉన్నట్టు చెబుతున్నారు.మిగతా బిల్లులన్నీ క్లియర్ కావడంతో పనులు చేయడా నికి కాంట్రాక్టర్లు ముందుకు వస్తుండడం గమనార్హం. ఇటీవల మొంథా తుఫాన్ వల్ల కూడా అనేక రోడ్లు దెబ్బతిన్న సంగతి తెలిసిందే. పంచాయతీ రాజ్‌కు సంబంధించిన 70 రోడ్లు 137 కిలోమీటర్ల పొడవున దెబ్బతిన్నాయి. వీటి నిర్మాణానికి రూ.86 కోట్ల 27 లక్షలు అవసరం అవుతాయని అంచనా వేశారు.





మొదలైన పాలచర్ల నుంచి గాడాల వెళ్లే రోడ్డు పనులు

బాలికల హాస్టళ్లకు ఉమెన్ వాచ్‌మెన్లు

» భద్రత పెంపునకు చర్యలు
» రాష్ట్ర గిరిజన సంక్షేమశాఖ డైరెక్టర్ భార్గవి



బొమ్మూరు గిరిజన పాఠశాలలో విద్యార్థినులతో కలిసి నేలపై కూర్చుని మధ్యాహ్న భోజనం చేస్తున్న భార్గవి

రాజమహేంద్రవరం అర్బన్/రాజమహేంద్రవరం రూరల్ , నవంబరు 28 (ఆంధ్రజ్యోతి) : హాస్టళ్లలో బాలికల భద్రతకు ఉమెన్ వాచ్‌మెన్లను నియమించనున్నామని రాష్ట్ర గిరిజన సంక్షేమ శాఖ డైరెక్టర్ ఎస్.భార్గవి అన్నారు. రాజమహేంద్రవరంలో నిర్వహించిన ఇంటిగ్రేటెడ్ గవర్నెన్స్ ద్వారా వాతావరణ స్థితిస్థాపక గిరిజన సంఘాలు' వర్క్‌షాపులో శుక్రవారం ఆమె పాల్గొన్నారు. అనంతరం బొమ్మూరులోని గిరిజన సంక్షేమ వసతిగృహాలను పరిశీలించారు. అక్కడి మౌలిక సౌకర్యాలు, శానిటేషన్, తాగునీరు, వసతి తదితర విషయాలను ఆరా తీశారు. డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజనంలో విద్యార్థులతో కలసి భోజనం చేశారు. ఆహార నాణ్యత, వంటశాల నిర్వహణ, పౌష్టికాహారంపై విద్యార్థుల అభిప్రాయాలు తెలుసుకున్నారు. భార్గవి మాట్లాడుతూ హాస్టల్ పిల్లల పట్ల బాధ్యత, మమకారం ఉండాలని సూచించారు. మన ఇంటి విషయంలో ఎంత పరిశుభ్రత పాటిస్తామో విద్యార్థుల వసతిగృహాల్లో అంతకంటే ఎక్కువ శ్రద్ధ తీసుకోవాలన్నారు. పరిశుభ్రతపై క్రమం తప్పకుండా పర్యవేక్షణ జరగాలన్నారు. ఉపాధ్యాయులు బోధన వృత్తి ధర్మమే అయినా విద్యార్థులతో మమేకమవుతూ వారి ఆలోచనలు,అవసరాలు తెలుసుకోవడం కూడా అంతే ముఖ్యమన్నారు. వసతి గృహాల ఆవరణలో పారిశుధ్యం సక్రమంగా లేకపోవడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. పంచాయతీ అధికారులను పిలిపించి తక్షణ చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకంలో విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. అహార నాణ్యత, వంటశాల నిర్వహణ, పౌష్టికాహారంపై విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. బాలికల భద్రతకు వసతి గృహాల్లో మహిళా వాచ్‌మెన్లను నియమిస్తామని తెలిపారు. ప్రతిరోజూ పాఠశాల తరగతులు పూర్తయిన తరువాత 5-10 నిమిషాలు పిల్లలతో మాట్లాడి వారి సమస్యలను తెలుసుకోవాలని హెచ్‌ఎం, వార్డెన్లకు సూచించారు. సంచాలకులతో పాటు జిరిజన పాఠశాల గిరిజన సంక్షేమ అధికారి జ్యోతి, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

స్పెషల్ గ్రేడ్ మునిసిపాలిటీగా నిడదవోలు

జీవో విడుదల చేసిన ప్రభుత్వం

నిడదవోలు, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి) : నిడదవోలు పురపాలక సంఘం మరో కీలక మైలురాయి దాటింది. ఇప్పటి వరకు సెకండ్ గ్రేడ్ మునిసిపాలిటీగా ఉన్న నిడదవోలు పురపాలక సంఘాన్ని కూటమి ప్రభుత్వం స్పెషల్ గ్రేడ్ మునిసిపాలిటీగా అప్‌గ్రేడ్ చేస్తూ జీవో జారీ చేసింది. నిడదవోలు పట్టణ వజ్రోత్సవ వేడుకల్లో రాష్ట్ర మంత్రి కందుల దుర్గేష్, ఎంపీ దగ్గుబాటి పురందేశ్వరి జీవో కాపీని ఆవిష్కరించారు.రెండు రోజుల కిందట ఇదే వజ్రోత్సవ వేడుకల్లో పాల్గొన్న పుర పాలకశాఖ మంత్రి పి.నారాయణ ఇచ్చిన హామీ మేరకు నిడదవోలు పురపాలక సంఘానికి స్పెషల్ గ్రేడ్ మునిసిపాలిటీగా జీవో జారీ చేశారు.



నిడదవోలు మునిసిపాలిటీకి స్పెషల్ గ్రేడ్ హోదా జీవో కాపీ చూపుతున్న ఎంపీ పురందేశ్వరి, మంత్రి దుర్గేష్

ప్రమాద రహిత డ్రైవింగ్‌పై ఆర్టీసీ డ్రైవర్లకు శిక్షణ

రాజమహేంద్రవరం అర్బన్, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి) : రాజమహేంద్రవరంలోని ఆర్టీసీ జోనల్ ట్రైనింగ్ కాలేజీలో హైర్ బస్ డ్రైవర్లు, ఆన్ కాల్ డ్రైవర్లకు శుక్రవారం ప్రమాదరహిత డ్రైవింగ్ శిక్షణ తరగతులు ప్రారంభించారు. జిల్లా ప్రజారవాణా అధికారి వైఎస్ఎన్ మూర్తి మాట్లాడుతూ డిసెంబరు 31వ తేదీ వరకూ శిక్షణ తరగతులు జరుగుతాయన్నారు. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా, పశ్చిమగోదావరి జిల్లా, ఏలూరు జిల్లాల్లోని 16 డిపోల నుంచి మొత్తం 1014 మంది డ్రైవర్లకు శిక్షణ ఇస్తారన్నారు.తొలిరోజున మొత్తం 63 మంది డ్రైవర్లకు శిక్షణ ఇచ్చారు.

విలీనంపై 30 రోజుల్లో అభ్యంతరాలు స్వీకరణ

రాజమహేంద్రవరం, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి) : తూర్పుగోదావరి జిల్లాలో మండపేట నియోజకవర్గం విలీనంపై ఏమైనా అభ్యంతరాలుంటే 30 రోజుల్లో తెలియజేయాలని కలెక్టర్ కీర్తి చేకూరి శుక్రవారం సూచించారు. ఆంధ్రప్రదేశ్ రెవెన్యూ శాఖ వెలువరించిన ప్రాథమిక నోటిఫికేషన్ ప్రకారం కోనసీమ జిల్లా రామచంద్రపురం డివిజన్ పరిధిలోని మండపేట, రాయవరం, కపిలేశ్వరపురం మండలాలు తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరం రెవెన్యూ డివిజన్ పరిధిలోకి బదిలీ ప్రతిపాదన ఉందన్నారు. దీనిపై 30 రోజుల్లోపు అభ్యంతరాలు , సూచనలు ఉంటే తెలియజేయాలని జిల్లా కలెక్టర్ కీర్తి చేకూరి సూచించారు.

ఇంటర్మీడి 'హీట్'



- మెరుగైన ఫలితాలే లక్ష్యంగా ప్రణాళికలు
- ప్రభుత్వ కళాశాలల విద్యార్థులపై ఫోకస్
- సీ, డీ గ్రేడ్ విద్యార్థులపై ప్రత్యేక దృష్టి
- స్టడీ అవర్స్ నిర్వహణ

ఇంటర్మీడియట్‌లో ఉత్తమ ఫలితాలే లక్ష్యంగా ఇంటర్ బోర్డు అధికారులు అడుగులు వేస్తున్నారు. మెరుగైన ఫలితాల కోసం కార్యాచరణ సిద్ధం చేశారు. ఇంటర్‌బోర్డు సూచనలకు అనుగుణంగా 'సంకల్ప దీక్ష' పేరుతో ప్రత్యేక కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ కార్యక్రమం ద్వారా విద్యార్థులను సన్నద్ధం చేస్తున్నారు.

– కాకినాడ, ఆంధ్రజ్యోతి

ఏ జిల్లా.. ఎన్ని కాలేజీలు...

కాకినాడ జిల్లాలో...

ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలోని కాకినాడ జిల్లాలో ప్రభుత్వ జూనియర్ కళాశాలలు 14, ఎయిడెడ్ జూనియర్ కళాశాలలు 3, ఏపీఎస్‌డబ్ల్యూ ఆర్ కళాశాలలు 8, హైస్కూల్ ప్లస్‌లు 19, కేజీబీవీలు 4, మోడల్ స్కూల్స్ జూనియర్ స్కూల్స్ 2, ప్రైవేట్ అన్‌ఎయిడెడ్ కళాశాలలు 99 ఉన్నాయి. వీటిలో ఫస్టియర్ విద్యార్థులు 22,574 మంది ద్వితీయ సంవత్సరం విద్యార్థులు 21716 మంది విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నారు.

తూర్పుగోదావరి జిల్లాలో..

ఈ జిల్లాలో ప్రభుత్వ జూనియర్ కళాశాలలో 15, ఎయిడెడ్ జూనియర్ కళాశాలలు 2, ఏపీఎస్‌డబ్ల్యూఆర్ కళాశాలలు 6, హైస్కూల్ ప్లస్‌లు 23, ప్రైవేటు అన్‌ఎయిడెడ్ కళాశాలలు 82, ఒకేషనల్ కళాశాలలు 21 ఉన్నాయి. వీటిలో ప్రథమ సంవత్సరం 23,118 మంది, ద్వితీయ సంవత్సరం 23,145 మంది విద్యనభ్యసిస్తున్నారు.

డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాలో..

ప్రభుత్వ జూనియర్ కళాశాలలు 13, ఏపీఎస్ డబ్ల్యూఆర్ జూనియర్ కళాశాలలు 6, హైస్కూల్ ప్లస్‌లు 28, ప్రైవేటు అన్‌ఎయిడెడ్ కళాశాలలు 88 ఉన్నాయి. 26,840 మంది విద్యార్థులు ఉన్నారు.

సిలబస్ పరిస్థితి ఏంటి..

డిసెంబర్ మొదటి వారం నాటికి అన్ని ప్రభుత్వ, ఎయిడెడ్ జూనియర్ కళాశాలల్లో సిలబస్ పూర్తి అవుతుందని ఇంటర్ బోర్డు అధికారులు చెబుతున్నారు. ఈ ఏడాది రాష్ట్రంలోనే అత్యుత్తమ ఫలితాలు సాధించే జిల్లాగా గుర్తింపు సాధించేలా అధ్యాపకుల సహకారంతో సమష్టిగా కృషి చేసేలా మూడు జిల్లా డీఐఈవోలు సంకల్ప దీక్షతో ఉన్నారు.

ఉమ్మడి జిల్లాల వారీగా ఇంటర్ పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులు (ప్రథమ, ద్వితీయ)

- కాకినాడ జిల్లా : 42,834
- తూర్పుగోదావరి జిల్లా : 43,872
- డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా :25,650

గ్రేడ్‌లుగా విభజన..

ఉత్తమ ఫలితాల కోసం ప్రత్యేక కసరత్తు!

ప్రభుత్వ, ఎయిడెడ్ కళాశాలల్లో ఇప్పటికే అర్ధ సంవత్సర పరీక్షలు పూర్తయ్యాయి. వాటిలో వచ్చిన మార్కులను అంచనా వేసి విద్యార్థులకు ప్రతి రోజూ ఉదయం 8.30 గంటల నుంచి 10 గంటల వరకు, సాయంత్రం నాలుగు నుంచి ఆరు గంటల వరకు ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో స్టడీ అవర్స్ నిర్వహిస్తున్నారు. అంతేకాకుండా ఇంటర్ బోర్డు ఇచ్చిన ప్రశ్నాపత్రాలతో విద్యార్థులకు వారాంతపు పరీక్షలు నిర్వహించేందుకు ఏర్పాట్లుచేశారు. ఈ పరీక్షల్లో వచ్చిన మార్కులను ఎప్పటికప్పుడు ఇంటర్ బోర్డుకు పంపుతున్నారు. విద్యార్థులను గ్రేడులుగా విభజించి ఏ, బీ గ్రేడుల్లో ఉన్న వారు బాగా చదువుతున్నట్లు, సీ, డీ గ్రేడ్ విద్యార్థులు ఇంకా మెరుగుపడాల్సి ఉందని గుర్తించారు. ఈ నేపథ్యంలో వారికి ప్రత్యేక శిక్షణతోపాటు కొంతమంది అధ్యాపకులు వారిని దత్తత తీసుకుని స్టడీ అవర్స్ నిర్వహించి ప్రత్యేకంగా చదివించే సంకల్పంతో ఉన్నారు. వచ్చే ఏడాది జనవరి 21 నుంచి ఎన్విరాన్‌మెంట్ పరీక్షలు ప్రారంభమవుతాయి. జనవరి 27 నుంచి ఫిబ్రవరి పదో తేదీ వరకు వృత్తి విద్య కోర్సులు అభ్యసించే వారికి ప్రాక్టికల్స్ నిర్వహిస్తారు. ఇంటర్ రెగ్యులర్ విద్యార్థులకు వచ్చే ఏడాది ఫిబ్రవరి 1 నుంచి పదో తేదీ వరకు ప్రయోగ పరీక్షలు ప్రారంభం కానున్నాయి. అనంతరం ఫిబ్రవరి 23 నుంచి మార్చి 24 వరకు పరీక్షలు జరగనున్నాయి.

ఆకతాయిలకు చెక్..



- విద్యార్థినులపై వేధింపుల నివారణకు చర్యలు
- 'పోక్సో ఈ-బాక్స్ యాప్'ను ప్రవేశపెట్టిన కేంద్రం
- ఫిర్యాదుదారుల వివరాలు గోప్యం

(కాకినాడ-ఆంధ్రజ్యోతి)

విద్యార్థినులపై లైంగిక దాడులు, వేధింపులు, బెదిరింపుల సంఘటనలు ఇటీవలకాలంలో అధికంగా కనిపిస్తున్నాయి. కళాశాలకో, పాఠశాలకో వెళ్లేటప్పుడు వారి వెంటపడి వేధించే ఆకతాయిలు పెరిగారు. వీరి ప్రవర్తనతో ఎంతోమంది విద్యార్థినులు పాఠశాలలకు, కళాశాలలకు వెళ్లడం మానేస్తున్నారు. ఈ ఆకతాయిల చర్యలతో అటు తల్లిదండ్రులకు మానసిక ప్రశాంతత కరువవుతోంది. తమ కుమార్తె ఇంటికి క్షేమంగా చేరుతుందా?, లేదా? అనే ఆందోళన వెంటాడుతోంది. చాలా మంది బాధితులు సామాజిక, కుటుంబ పరిస్థితుల నేపథ్యంలో భయపడి ఫిర్యాదు చేసేందుకు ముందుకు రావడం లేదు. కొన్ని చోట్ల పోలీసులు ఇలాంటి ఆకతాయిల వికృత చేష్టలకు అడ్డుకట్ట వేసినా.. చాలా చోట్ల వీరు రెచ్చిపోతూనే ఉన్నారు. విద్యార్థినులను వేధిస్తూనే ఉన్నారు. ముఖ్యంగా కళాశాలలు, పాఠశాలలకు వద్ద, బస్టాండుల్లో, ఒంటరిగా ఎక్కడికైనా వెళ్లే సమయంలోనూ ఇలాంటి సంఘటనలు జరుగుతున్నాయి. ఆకతాయిల ఆగడాలు మరింత శ్రుతిమించుతున్నాయి. వీటికి అడ్డుకట్ట వేసే దిశగా కేంద్రం 'పోక్సో ఈ-బాక్స్ యాప్'ను అందుబాటులోకి తెచ్చింది. ఈ యాప్‌లో ఫిర్యాదు చేస్తే బాధితుల వివరాలు గోప్యంగా ఉంచడంతో పాటు క్షేత్రస్థాయిలో విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకుంటారు.

ఇలా ఫిర్యాదు చేయవచ్చు..

సెల్‌ఫోన్‌లో గూగుల్ ప్లేస్టోర్ నుంచి ఈ యాప్‌ను ముందుగా డౌన్‌లోడ్ చేసుకోవాలి. పోక్సో ఈ బాక్స్ (పీఓసీఎస్‌ఓ ఈ బీఓఎక్స్) అని టైప్ చేసి యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకోవచ్చు. హోం పేజీలో ఎరుపు రంగు బటన్‌పై క్లిక్ చేయాలి. క్రీడా ప్రాంగణం, షాపు, రోడ్డు, స్కూలు, ట్యూషన్, బ్లాక్‌మెయిల్, స్కూల్ బస్, వ్యాన్, కుటుంబసభ్యులు, బంధువులు, ఇం టర్నెట్, సెల్‌ఫోన్ ఇలా రకరకాల చిత్రాలతో గుర్తులు కనిపిస్తాయి. బాధితులు తమ సమస్యలకు సంబంధించిన గుర్తుపై క్లిక్ చేసి పేరు, ఈ-మెయిల్, సెల్‌ఫోన్ నంబర్ నమోదు చేయాలి. సంఘటన సమాచారాన్ని నమోదు చేసి సబ్‌మిట్ చేయాలి. ప్రతి ఫిర్యాదుకు రిఫరెన్స్ ఉంటుంది. ఆన్‌లైన్‌లో హెచ్‌టీటీపీఎస్:///ఎన్‌సీపీసీఆర్.జీవోవీ.ఐఎన్/పీఓసీఎస్‌ఓ// ద్వారా కూడా ఫిర్యాదు చేయవచ్చు. ఈ యాప్ నిర్వహణ జాతీయ బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ పరిధిలో ఉంటుంది.





మహా సంస్థానంలో శ్రీపాదశ్రీవల్లభుల దివ్య పాదుకలకు అభిషేకం, పాదగయ క్షేత్రంలో ప్రత్యేక అలంకరణలో స్వయంభూ దత్తాత్రేయస్వామి

జై గురుదత్త

- పిఠాపురంలో దత్త జయంతి సప్తాహ మహోత్సవాలు ప్రారంభం
- మహా సంస్థానంలో తొలిరోజు సర్వ పుష్ప పూజ
- వైభవంగా దత్తాత్రేయ స్వామి గ్రామోత్సవం

పిఠాపురం, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): శ్రీపాదశ్రీవల్లభుల జన్మస్థానంగా ప్రాచుర్యం పొందిన కాకినాడ జిల్లా పిఠాపురంలోని శ్రీపాద శ్రీవల్లభ మహా సంస్థానంలో దత్త జయంతి సప్తాహ మహోత్సవాలు శుక్రవారం ప్రారంభమయ్యాయి. పట్టణ వీధుల్లో దత్తాత్రేయస్వామి గ్రామోత్సవం వైభవంగా జరిగింది. తొలి రోజు మహా గణపతి పూజ, కలశస్థాపన, శ్రీపాదశ్రీవల్లభుల మహిమాన్విత దివ్య పాద పద్మాలకు మహన్యాసపూర్వక శత రుద్రాభిషేకం, శ్రీసూక్త, పురుష సూక్తాలతో సహస్ర నామార్చన, మంగళ హారతి, మంత్రపుష్పం, వేదపారాయణ, రుత్విక్కులతో మూలమంత్ర అనుష్టానం, గణపతి అధర్వశీర్ష ఉపనిషత్ పారాయణ, గురుచరిత్ర, శ్రీపాదశ్రీవల్లభ చరితామృత పారాయణ జరిగాయి. సాయంత్రం అగ్నిప్రతిష్ఠాపన, దత్తమంత్ర హోమం, శ్రీపాదశ్రీవల్లభుల దివ్య పాద పద్మాలకు వివిధ హారతులు, స్వామివారికి పల్లకీసేవ, సాయంకాలార్చన నిర్వహించారు. సర్వ పుష్ప పూజ అనంతరం శ్రీపాదశ్రీవల్లభులు, దత్తాత్రేయస్వామి, నృసింహసరస్వతులను ప్రత్యేకంగా అలంకరించారు. ఉభయ తెలుగు రాష్ట్రాలతో పాటు మహారాష్ట్ర, కర్ణాటక నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. ఈవో సౌజన్య ఏర్పాట్లను పర్యవేక్షించారు.



శ్రీపాదశ్రీవల్లభ మహా సంస్థానంలో పూజలో పాల్గొన్న భక్తులు

పట్టణంలోని పాదగయ క్షేత్రంలో స్వయంభువుగా వెలసిన దత్తాత్రేయస్వామి సన్నిధిలో దత్త జయంతి సప్తాహ మహోత్సవాలు వైభవంగా ప్రారంభమయ్యాయి. ఉదయం మహా గణపతి పూజ, కలశస్థాపనలు, రుత్విక్ వరుణలు, పంచామృత సహిత రుద్రాభిషేకం, సహస్రనామార్చన, మం గళహారతి, మంత్రపుష్పం, రుత్వికులతో దత్తమాల మంత్ర అనుష్టానం, గురుచరిత్ర పారాయణ, వేదపారాయణ, గణపతి అధర్వశీర్ష ఉప నిషత్ పారాయణ, విష్ణు, లలిత సహస్ర నామ పారాయణ నిర్వహించారు. సాయంత్రం అగ్ని ప్రతిష్ఠాపన, దత్తమూల మంత్ర హోమాదులు, సాయంకాల విశేష పుష్పార్చన, మంగళహారతి జరిగాయి. అనంతరం స్వయంభూ దత్తాత్రేయస్వామికి సహస్ర కలువలతో పుష్పార్చన నిర్వహించి ప్రత్యేక అలంకారం చేశారు. ఈవో కాట్నం జగన్మోహన శ్రీనివాస్, సూపరింటెండెంట్ వీరభద్రరావు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

జనవరి 24 నుంచి ఉభయ తెలుగు రాష్ట్రాల ఆహ్వాన నాటిక పోటీలు

పెద్దాపురం, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): ఉభయ తెలుగు రాష్ట్రాల ఆహ్వాన నాటిక పోటీలను కాకినాడ జిల్లా పెద్దాపురం మండలం చంద్రమాంపల్లి గ్రామంలో జనవరి 24 నుంచి 26వ తేదీ వరకు నిర్వహించనున్నట్టు స్నేహ ఆర్ట్స్ నాటక పరిషత్ అధ్యక్షుడు గొందేసి రాజా తెలిపారు. నాటికల వివరాలు తెలిపే కరపత్రాన్ని శుక్రవారం ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ 24న ప్రారంభ నాటికగా విజయవాడ వారి మమ్మల్ని బ్రతకనివ్వండి, రెండో ప్రదర్శనగా హైదరాబాద్ వారి గేమ్, మూడో ప్రదర్శనగా కొలకలూరు వారి జనరల్ బోగీలు, 25న విశాఖపట్నం వారి అసత్యం, రెండో ప్రదర్శనగా కాకినాడ వారి ఆచమనం, మూడో ప్రదర్శనగా చిలకలూరిపేట వారి మా ఇంట్లో మహాభారతం, 26న హైదరాబాద్ వారి అమ్మచెక్కిన బొమ్మ, రెండో ప్రదర్శనగా ఇది అతని సంతకం ఉంటాయన్నారు. కార్యక్రమంలో ఇందన బ్రహ్మానందం, కేదారి నాగు, దేవాడ పాపేశ్వరరావు, మంతెన సత్తిబాబు, వెన్న పండు, నూకలబంతి నానాజీ, కంటిబోయిన ప్రసాద్, ద్వారంపూడి చల్లారావు పాల్గొన్నారు.



నాటిక పోటీల కరపత్రాలను ఆవిష్కరిస్తున్న దృశ్యం



మోక్షిత్ శ్రీసాయిని అభినందిస్తున్న ఉపాధ్యాయులు

రాష్ట్ర స్థాయి క్రికెట్ పోటీలకు 'శ్రీప్రకాష్' విద్యార్థి ఎంపిక

పెద్దాపురం, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): శ్రీప్రకాష్ సినర్జీ స్కూల్లో 7వ తరగతి చదువుతున్న ఎస్.మోక్షిత్ శ్రీసాయి కాకినాడలో జరిగిన ఎస్‌జీఎఫ్‌ఐ జిల్లా స్థాయి క్రికెట్ టోర్నమెంట్‌లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచాడని డైరెక్టర్ సీహెచ్ విజయ్‌ప్రకాష్ తెలిపారు. ఈ నెల 29 నుంచి డిసెంబరు ఒకటో తేదీ వరకు గుంటూరు జిల్లా పేరిచర్లలో జరిగే రాష్ట్ర స్థాయి క్రికెట్ జట్టు ఎంపిక పోటీలో ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా జట్టు తరపున పాల్గొంటాడు. విద్యార్థితో పాటు కోచ్ జి.దుర్గాప్రసాద్‌ను విజయ్‌ప్రకాష్, సీనియర్ ప్రిన్సిపాల్ ఎంవీవీఎస్ మూర్తి, అకడమిక్ కో-ఆర్డినేటర్ ప్రశాంతి, కల్చరల్ కో-ఆర్డినేటర్ ఉషాచైతన్య, ఉపాధ్యాయులు అభినందించారు.

'పాడా' ఇన్‌చార్జి పీడీగా శ్రీనివాసరావు

కలెక్టరేట్ (కాకినాడ), నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): పిఠాపురం ప్రాంత ప్రాధికార అభివృద్ధి సంస్థ (పాడా) ఇన్‌చార్జి ప్రాజెక్టు డైరెక్టర్‌గా శ్రీనివాసరావును నియమించనున్నారు. ఇప్పటివరకు వున్న చైత్రవర్షిణిని గ్రామీణాభివృద్ధి శాఖ కమిషనరు కార్యాలయంలో మైక్రో క్రెడిట్ విభాగం స్పెషల్ ఆఫీసర్‌గా నియమిస్తూ బదిలీ చేశారు. దీంతో బీసీ కార్పొరేషన్ ఈడీ శ్రీనివాసరావుకు ఇన్‌చార్జి బాధ్యతలు అప్పగించనున్నారు.





ఖమ్మం జిల్లా పుట్టిన రోజు ధ్రువీకరణ పత్రం కలిగి ఉన్న మల్లవరం గ్రామానికి చెందిన పురపతి.. శ్రీదేవి, స్రవంతిల పుట్టిన రోజు ధ్రువీకరణ పత్రాలు ఖమ్మం జిల్లావి కాగా వీరి బిడ్డలవి అల్లూరి సీతారామరాజు జిల్లా ధ్రువీకరణ పత్రాలు



ఒడియా క్యాంపునకు చెందిన ఈ చిన్నారుల్లో సంతోష్ (అన్న)కు తూర్పుగోదావరి జిల్లా, సీతారం (తమ్ముడు)కు అల్లూరి సీతారామరాజు జిల్లా పుట్టినరోజు ధ్రువీకరణ పత్రాలు ఉన్నాయి.



వీరంతా చింతూరు ఏరియా ఆసుపత్రిలో వైద్యుల పర్యవేక్షణలో ఉన్న గర్భిణులు.. మరి కొద్దినెలల్లో వీరంతా పండంటి బిడ్డలకు జన్మనివ్వబోతున్నారు. కాగా పుట్టబోయే ఆ బిడ్డలంతా పోలవరం జిల్లా పేరిట ధ్రువీకరణ పత్రాలు పొందనున్నారు.

మళ్లీ మారనున్న చిరునామా!

- ఒకే ఊరు .. నాలుగు జిల్లాలు
- ఇది చింతూరు డివిజనుకే సొంతం

(చింతూరు-ఆంధ్రజ్యోతి)

ఆ ఇంటి పెద్దలకు ఖమ్మం జిల్లా పేరిట పుట్టినరోజు ధ్రువీకరణ పత్రాలున్నాయి. ఇక 2014లో రాష్ట్ర విభజన తదుపరి ఆ ఇంట్లో పుట్టిన బిడ్డలకు తూర్పుగోదావరి జిల్లా పేరిట, 2022లో జిల్లాల పునర్విభజన తదుపరి పుట్టిన బిడ్డలకు అల్లూరి సీతారామరాజు జిల్లా పేరిట పుట్టినరోజు ధ్రువీకరణ పత్రాలున్నాయి. తాజాగా పాలనా సౌలభ్యం కోసం మరోమారు చేపట్టిన జిల్లాల పునర్విభజన క్రమంలో అదే ఇంట్లో మరికొద్దిరోజుల్లో పుట్టబోయే బిడ్డకు పోలవరం (రంపచోడవరం) జిల్లా పేరిట పుట్టినరోజు ధ్రువీకరణ పత్రం అందుకోనున్నారు. అంటే ఒకే ఇంట్లో మొత్తంగా నాలుగు జిల్లాల పేరిట పుట్టినరోజు ధ్రువీకరణ పత్రాలు ఉండనున్నాయి. ఓటరు, ఆధార్, రేషన్‌కార్డుల చిరునామాలు కూడా ఇదే వరుసలో మారుతూ వస్తున్నాయి. ఈ తరహా మార్పులు చింతూరు డివిజనులో ఏ ఇంట చూసినా కానవస్తుంటాయి. అంటే పేరు, ఇల్లు, ఊరు మారకపోయినా జిల్లాలు మారుతూ వస్తున్నాయి. ఇదిలా ఉంటే ఒకే పాఠశాలలో లేదా అంగన్వాడీ కేంద్రాల్లోనూ తూర్పుగోదావరి, అల్లూరి సీతారామరాజు జిల్లాల చిరునామాల పేరిట చదువుతున్న చిన్నారులున్నారు. ఇక వారికి పాఠాలు బోధించే ఉపాధ్యాయుల్లో పలువురికి ఖమ్మం జిల్లా పేరిట పుట్టిన స్థల ధ్రువీకరణ పత్రాలు ఉంటుంటాయి. ఈ మార్పులకు కారణం కేవలం పోలవరమే. 2014లో రాష్ట్ర విభజన జరిగింది. ఇక పోలవరంతో చింతూరు, కూనవరం, వరరామచంద్రపురం, ఎటపాక మండలాలు పోలవరం బ్యాక్ వాటర్‌తో నీట మునగనున్న విషయం సాంకేతికంగా స్పష్టమైంది. దీంతో ముంపు మండలాలను విభజిత ఆంధ్రప్రదేశ్‌లో విలీనం చేసేశారు. అప్పటివరకు తెలంగాణ భూభాగంలోని ఖమ్మం జిల్లాలో ఉన్నటువంటి ఈ నాలుగు మండలాలు తూర్పుగోదావరి జిల్లాలోకి విలీనమయ్యాయి. తదుపరి రాష్ట్రంలో చోటుచేసుకున్న పునర్విభజన నేపథ్యంలో విలీన ప్రజలు ఖమ్మం నుంచి తాజాగా పోలవరం జిల్లా వరకు పేరు, ఊరు, ఇల్లు మారకపోయినా జిల్లాలు మారుతూ వస్తున్నారు. తాజాగా సీఎం చంద్రబాబు గ్రీన్‌సిగ్నల్ ఇవ్వడం, పోలవరం జిల్లాగా ఏర్పాటు చేసేందుకు జీవో నం, 1492తో కూడిన నోటిఫికేషన్ విడుదల చేయడం చకచకా జరిగాయి. దీంతో రంపచోడవరం, మారేడుమిల్లి, దేవీపట్నం, గుర్తేడు, గంగవరం, అడ్డతీగల, వై.రామవరం, రాజవమ్మంగి, చింతూరు, కూనవరం, వరరామచంద్రపురం, ఎటపాక మండలాలతో కూడిన పోలవరం జిల్లా ఏర్పాటుకు రంగం సిద్ధమైంది. కాగా 30 రోజులు వ్యవధిలో ప్రజల అభిప్రాయాలు, అభ్యంతరాలు, మార్పులతో కూడిన లేఖలను జిల్లా కలెక్టర్‌కు ఇవ్వవచ్చని ప్రభుత్వం గడువు ఇచ్చినప్పటికీ పోలవరం జిల్లా ఏర్పాటు ఏకగ్రీవమే అన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ఆదివాసీ నాయకుల నుంచి వివిధ పార్టీల నేతల వరకు పోలవరం జిల్లా ఏర్పాటు నిర్ణయంతో ఏకీభవించడం దీంతో నూతన జిల్లాగా పోలవరం ఏర్పాటు ఇక లాంచనమే. కాగా జిల్లాల మార్పు జరిగిన ప్రతిసారీ సాంకేతిక సమస్య వచ్చిపడుతోంది. దీంతో ప్రజలు అవస్థలు పడాల్సిన పరిస్థితి నెలకొంది. ఈ సమస్యలను తొలగించేందుకు ప్రభుత్వం చొరవ తీసుకోవాల్సి ఉంది.



సత్యదేవుని దర్శనానంతరం ఉప కులపతి చంద్రశేఖర్ కుటుంబీకులు



ఏఈవో శ్రీనివాస్‌కు విరాళం అందజేస్తున్న సత్యశ్రావ్య

సత్యదేవుని సన్నిధిలో ఎన్టీఆర్ ఆరోగ్య విశ్వవిద్యాలయం ఉప కులపతి

అన్నవరం, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): రత్నగిరివాసుడైన సత్యదేవుని సన్నిధికి శుక్రవారం ఎన్టీఆర్ ఆరోగ్య విశ్వవిద్యాలయం ఉప కులపతి డాక్టర్ పి.చంద్రశేఖర్ విచ్చేశారు. కుటుంబసభ్యులతో కలిసి స్వామిని దర్శించుకుని ప్ర త్యేక పూజలు చేశారు. అధికారులు ఆలయ మ ర్యాదలతో స్వాగతం పలకగా పండితులు వేదాశీర్వచనాలు అందజేశారు. అన్నవరం దేవస్థానంలో ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్న సత్యదేవ నిత్యాన్నదాన పథకానికి చెన్నయ్‌కు చెందిన రా వూరి శ్రీసాయి సత్య శ్రావ్య రూ.1,01,116 విరాళం సమర్పించారు. కుటుంబ సభ్యులతో కలిసి ఈ మొత్తాన్ని ఏఈవో శ్రీనివాస్, పీఆర్వో అనకాపల్లి ప్రసాద్‌లకు అందజేశారు. దాతను వారు అభినందించి స్వామివారి ప్రసాదం ఇచ్చారు.

సివిల్స్ పరీక్షలకు విజయవాడలో ఉచిత శిక్షణ

కలెక్టరేట్ (కాకినాడ), నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలో బీసీ, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు సివిల్స్ పరీక్షలకు విజయవాడలో ఉచిత శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నట్టు వెనుకబడిన తరగతుల సంక్షేమ సాధికారిత అధికారిణి ఎం.లల్లీ తెలిపారు. శుక్రవారం ఆమె ఈ మేరకు ఒక ప్రకటన వెలువరించారు. అర్హత కలిగిన అభ్యర్థులు డిసెంబరు 3వ తేదీలోపు వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ కార్యాలయం, ప్రగతి భవనం, రెండో అంతస్తు, డీఆర్డీఏ కాంప్లెక్స్, కాకినాడలో దరఖాస్తు చేయాలన్నారు. వారికి డిసెంబరు 7న స్క్రీనింగ్ పరీక్ష నిర్వహిస్తామన్నారు. ఉత్తీర్ణులైన వారికి మెరిట్ ఆధారంగా విజయవాడలో శిక్షణ ఇస్తారన్నారు. బీసీలను 66శాతం, ఎస్సీలను 20 శాతం, ఎస్టీలను 14శాతం రిజర్వేషన్ ప్రాతిపదికన ఎంపిక చేస్తారన్నారు. సివిల్స్ ప్రిలిమనరీ, మెయిన్స్ పరీక్షలకు దరఖాస్తు చేసే అభ్యర్థులు తమ బయోడేటాతో పాటు పదో తరగతి, ఇంటర్, డిగ్రీ మార్కులిస్టులు, కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాలు, ఆధార్, బ్యాంకు పాస్ పుస్తకాలు, రెండు పాస్‌పోర్టు సైజు ఫొటోలను కాకినాడలో ఉన్న వెనుకబడిన తరగతుల సంక్షేమ అధికారి కార్యాలయంలో అందజేయాలన్నారు. ఇతర వివరాలకు 0884-2379216, 8008121321 నెంబర్లలో సంప్రదించాలన్నారు.

బీసీలకు ఎరుకుల కులంగా ఎస్టీ ధ్రువీకరణ పత్రాలు

జారీ చేస్తున్న అధికారులపై కేసులు పెట్టాలి: ఎరుకుల సామాజికవర్గీయుల డిమాండ్

రామచంద్రపురం (ద్రాక్షారామ), నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): బీసీ సామాజికవర్గీయులను ఎరుకుల కులంగా పేర్కొంటూ తమ కులస్తులకు తీవ్ర అన్యాయం చేస్తున్నారని ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా ఆదివాసీ ఎరుకుల ప్రజా సంఘాల ప్రతినిధులు ఆరోపించారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా రామచంద్రపురం లయన్స్ కల్యాణ మండపంలో ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా ఆదివాసీ ఎరుకుల జాతి ప్రజా సంఘాల ఐక్య కార్యాచరణ సదస్సు శుక్రవారం జరిగింది. తూర్పు గోదావరి జిల్లా అధ్యక్షుడు మానుపాటి రామకృష్ణ, కాకినాడ జిల్లా అధ్యక్షుడు సంగడాల వెంకటరమణ, కోనసీమ జిల్లా అధ్యక్షుడు మానుపాటి గోవిందు మాట్లాడుతూ ఎరుకుల సామాజికవర్గానికి అధికారులు తీవ్ర అన్యాయం చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. బీసీ సామాజికవర్గానికి చెందిన వారికి ఎరుకుల కులంగా ఎస్టీ ధ్రువీకరణ పత్రాలు జారీ చేయడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నిం చారు. ఇది పూర్తిగా రాజ్యాంగ విరుద్ధమన్నారు. తప్పుడు ధ్రువీకరణ పత్రాలు జారీ చేసిన అధికారులపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. తక్షణం ప్రత్యేక దర్యాప్తు బృందం ఏర్పాటుచేసి సంబంధిత అధికారులపై చర్యలు తీసుకోవాలని కోరారు. సదస్సులో ఎరుకుల సామాజికవర్గీయులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.



సమావేశంలో పాల్గొన్న మూడు జిల్లాల అధ్యక్షులు

ఆనందంలో ఆయిల్‌పామ్ రైతు

- టన్ను రూ.19,660
- ధర నిలకడగా ఉండడంతో సాగుపై ఆసక్తి చూపిస్తున్న రైతులు
- జిల్లాలో 49,710 ఎకరాల్లో సాగు
- అత్యధికంగా గండేపల్లి మండలంలో 14 వేల ఎకరాలు


మల్లేపల్లిలో సాగు చేస్తున్న పామాయిల్ తోట

గండేపల్లి, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి) : కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఆయిల్‌పామ్ ధర అంచలంచెలుగా పెరుగుతూ ప్రస్తుతం టన్ను రూ.19,660 పలకడంతో పాటు ధర కూడా నిలకడగా ఉండడంతో రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. గత ప్రభుత్వంలో ధర నిలకడగాలేక సుమారు రూ.25 వేలకు టన్ను ధర పెంచేసి మళ్లీ రూ.12 వేలకు చేసే యడంతో అప్పట్లో కౌలుకు తీసుకున్న రైతులు తీవ్ర నష్టాలు చవిచూశారు. ఆ సమయంలో పామాయిల్ రైతులు కుదేలయ్యారు. పలుచోట్ల తోటలు సైతం తొలగించిన దాఖలాలు ఉన్నాయి. నిరాశగా ఉన్న రైతుకు కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఊపిరిపీల్చుకున్నట్లయ్యింది. పామాయిల్ ఎకరానికి ఎనిమిది నుంచి తొమ్మిది టన్నుల వరకు దిగుబడి వస్తుందని రైతులు చెపుతున్నారు. ఎకరానికి సుమారు రూ.30వేలు ఖర్చవుతుందని, సొంత రైతులకు ఎకరానికి లక్ష మిగిలితే కౌలు రైతులకు సుమారు రూ.70 వేలు లాభాలు వస్తున్నాయంటున్నారు. దీంతో మళ్లీ పామాయిల్ తోటలు వేసేందుకు రైతులు ఆసక్తి చూపుతున్నారు. జిల్లాలో సుమారు 49,710 ఎకరాల్లో రైతులు ఈ పంట సాగుచేస్తుంటే ఒక్క గండేపల్లి మండలంలోనే సుమారు 14వేల ఎకరాల్లో రైతులు ఈ పంటను పండిస్తున్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ధర నిలకడగా ఉండి ఇంకా పెరిగే అవకాశముండడంతో


గండేపల్లిలో లారీలో లోడు చేస్తున్న పామాయిల్ గెలలు

జిల్లాలో 9 వేల ఎకరాల్లో కొత్తగా సాగుచేపట్టారు. అందులో గండేపల్లి మండలంలో అత్యధికంగా రెండు వేల ఎకరాల్లో ఈ సాగును పెంచారని అధికారులు చెపుతున్నారు. అయితే దీంతో పాటు సాగుచేసేందుకు ప్రభుత్వం కూడా రైతులకు రాయితీల రూపంలో చేయూతనివ్వడంతో రైతులు పంటలు చేసేందుకు మరింత ఆసక్తి చూపుతున్నా రు. మొక్కలు నిమిత్తం ఎకరానికి రూ.11వేలు, ఎరువులకు నాలుగు సంవత్సరాలకు రూ.8400, మొక్కతోటలో అంతర పంటలు పండించేందుకు నాలుగు సంవత్సరాలకు రూ. 8400 ప్రభుత్వం అందించడంతో చిన్న, సన్నకారు రైతులకు రాయితీపై డ్రిప్ లైన్ ప్రభుత్వం అందిస్తుంది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఆయిల్‌పామ్ రైతులకు ఊపిరిపోసినట్లయిందని గత ప్రభుత్వంలో ఎదుర్కొన్న నష్టాల నుంచి బయడపడుతున్నామని రైతులు చెబుతున్నారు.

ఇప్పుడిప్పుడే నష్టాల నుంచి కోలుకుంటున్నాం



గత ప్రభుత్వంలో టన్నుకు రూ.25 వేలు పెంచడంతో అధిక మొత్తంలో కౌలుకు తీసుకున్నారు. ఒక్కసారిగా మళ్లీ ధర తగ్గించేయడంతో తీవ్ర నష్టాలు ఎదుర్కొన్నాను. మళ్లీ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ధర పెంచడంతో పాటు నష్టాల నుంచి బయటపడుతున్నాం. ధర ఇలాగే ఉంటే రైతులకు గిట్టుబాటు అవుతుంది. ప్రభుత్వ రాయితీలు బాగున్నాయి.

- రైతు పిల్లా సత్తిబాబు, మల్లేపల్లి

131 కిలోల గంజాయి పట్టివేత

- ఇద్దరు యువకుల అరెస్ట్
- వాహనాన్ని స్వాధీనం చేసుకున్న పోలీసులు


నిందితుల్ని, వ్యాన్‌ను స్వాధీనం చేసుకున్న నల్లజర్ల పోలీసులు

నల్లజర్ల, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి) : కేడీపేట సమీపంలోని కాకరపాడు ఏజెన్సీ ఏరియా నుంచి 131 కిలోల గంజాయి తీసుకుని వస్తున్న ఇద్దరి యువకులను శుక్రవారం పట్టుకుని అరెస్ట్ చేసినట్టు నల్లజర్ల సీఐ రాంబాబు పేర్కొన్నారు. వ్యాన్‌లో గంజాయి తరలిస్తున్నట్టు సమాచారం రావడంతో తాడేపల్లిగూడెం నుంచి నల్లజర్ల వచ్చే మార్గంలో వాహనాలు తనిఖీ చేస్తుండగా, ఏపీ 31టీఏ 5142 నెంబరు గల బొలెరో వాహనంలో ప్లాస్టిక్ సంచుల్లో తరలిస్తున్నట్టు గుర్తించారు. అలాగే వాహనంతో పాటు సత్యసాయి పుట్టపర్తి జిల్లా గోరంట్ల మండలం మంగాలపల్లికి చెందిన తలారి ఆనంద్, మరో వ్యక్తి అదే జిల్లాకు చెందిన పూల మనోహర్‌ను అరెస్ట్ చేశారు. వీరిలో మనోహర్‌పై పలు పోలీస్ స్టేషన్లల్లో కేసులు నమోదైనట్టు పోలీసులు తెలిపారు. ముఠాను ఎస్సై దుర్గాప్రసాద్, సిబ్బంది చాకచక్యంగా పట్టుకున్నారని, వారిని ఎస్పీ నరసింహ కిషోర్, కొవ్వూరు డీఎస్పీ దేవకుమార్ అభినందించారు.

చైన్ స్నాచర్‌కు ఆరు నెలల జైలు శిక్ష ఖరారు

కాకినాడ క్రైం, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): ఒంటరిగా నడిచి వెళుతున్న మహిళ మెడలోని బంగారు గొలుసు తెంపిన కేసులో నిందితుడిపై నేరం రుజువు కావడంతో ఆరు నెలల జైలు శిక్ష విధిస్తూ కాకినాడ మొదటి అదనపు ఫస్ట్ క్లాస్ మెజిస్ట్రేట్ వి.సాహితి శుక్రవారం తీర్పు చెప్పారు. వివరాలిలా ఉన్నాయి. కాకినాడ గాంధీనగర్ చీడీలపొర వద్ద అదే ప్రాంతానికి చెందిన ఓ మహిళ 2021 డిసెంబరు 23వ తేదీ రాత్రి 7 గంటల ప్రాంతంలో బంధువుల ఇంటికి వెళ్లి తిరిగి నడిచి వస్తున్న క్రమంలో స్థానిక సూర్యనారాయణపురానికి చెందిన కర్నేని దుర్గాసాయి బైక్‌పై వేగంగా వచ్చి ఆమె మెడలోని బంగారు గొలుసు లాక్కుని పరారయ్యాడు. అనంతరం ఆమె స్థానికుల సహాయంతో టూటౌన్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. అప్పటి సీసీఎస్ ఎస్సై టి.క్రాంతికుమార్ దర్యాప్తు చేపట్టి నిందితుడు దుర్గాసాయిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. అప్పటి నుంచి కోర్టులో జరిగిన వాదోపవాదనల్లో నిందితుడిపై నేరారోపణ రుజువు కావడంతో మెజిస్ట్రేట్ పై విధంగా తీర్పు చెప్పారు. ప్రస్తుత సీఐ మజ్జి అప్పల నాయుడు పర్యవేక్షణలో కోర్టు కానిస్టేబుల్ ఎస్. లోవరాజు సాక్ష్యులను ఏ ప్రలోభాలకు లొంగకుండా ప్రవేశపెట్టి నిందితుడికి శిక్ష పడే విధంగా చర్యలు చేపట్టి నందుకు ఎస్పీ జి. బిందుమాధవ్ ప్రత్యేకంగా అభినందించారు. ప్రాసిక్యూషన్ తరపున ఏపీపీ పి. రఘువీర్ వాదనలు వినిపించారు.

మెడికవర్‌లో అరుదైన శస్త్ర చికిత్స


శస్త్రచికత్స చేయించుకున్న వ్యక్తితో వైద్యబృందం

సామర్లకోట, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): సామర్లకోట ఏడీబీ రోడ్డులోని మెడికవర్ హాస్పిటల్స్ ఆర్థోపెడిక్ వైద్య బృందం అరుదైన శస్త్రచికిత్స చేసింది. అత్యంత అరుదుగా కనిపించే డెవలప్‌మెంటల్ డిస్ప్లేసియా ఆఫ్ ది హిప్ రకమైన తుంటి సమస్యకు అత్యాధునిక సాంకేతికత పరిజ్ఞానంతో రోగి పరిస్థితిని వేగంగా విశ్లేషించి తుంటి మార్పిడి శస్త్రచికత్సను విజయవంతంగా పూర్తిచేసినట్టు వైద్యబృందం వెల్లడించింది. శుక్రవారం సామర్లకోటలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆర్థోపెడిక్ వైద్య నిపుణులు డాక్టర్ అరుణ్‌కుమార్, డాక్టర్ సుదర్శనరెడ్డి, డాక్టర్ మాధవరావు, డాక్టర్ కిషోర్ బాబు మాట్లాడారు. అల్లూరి సీతారామరాజు జిల్లా రాజవొమ్మంగి ప్రాంతానికి చెందిన 45 సంవత్సరాల వయస్సు గల ఏ.సత్యనారాయణ ప్రమాదవశాత్తు పడిపోవడంతో తుంటి ఎముకకు గాయమయ్యింది. దీంతో నడవలేని స్థితిలో ఆసుపత్రికి రావడం జరిగిందన్నారు. సదరు వ్యక్తికి అన్ని ప్రాథమిక వైద్యపరీక్షలు నిర్వహించిన అనంతరం గాయంతో పాటు తుంటి ఎముకు పుట్టుకతోనే డెవలప్‌మెంటల్ డిస్ప్లేసియా ఆఫ్ ది హిప్ పేరిట తుంటి ఎముకలో సమస్య ఉన్నట్టు కూడా గుర్తించామన్నారు. వెంటనే అనస్తీషియా వైద్యులు కిషోర్‌బాబు , డాక్టర్ అరవింద్ నేతృత్వంలో శస్త్రచికిత్స విజయవంతంగా నిర్వహించామన్నారు. శస్త్రచికిత్స నిర్వహించిన 24 గంటల్లో సత్యనారాయణ తనే స్వయంగా లేచి నిలబడగలగడంతో శస్త్రచికత్స విజయవంతమైనట్టు తెలిపారు. తనకు ఈ శస్త్రచికిత్స నిర్వహించడంలో మెడికవర్ వైద్య బృందం చేసిన కృషికి సత్యనారాయణ కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం సెంటర్ హెడ్ శుభాకరరావు మాట్లాడుతూ ఈ తుంటి మార్పిడి శస్త్రచికిత్స విజయవంతం కావడంతో హాస్పిటల్‌లో అందుబాటులో ఉన్న ఆధునిక వైద్యసేవల స్థాయిని, నిపుణులతో కూడిన మల్టీస్పెషాలిటీ కేర్ సేవల స్థాయిని మరోసారి ప్రతిబింబించిందన్నారు.

బీఎస్సీ నర్సింగ్ కౌన్సెలింగ్‌కు నేడు తుది గడువు

జీజీహెచ్ (కాకినాడ), నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): బీఎస్సీ నర్సింగ్ మూడో దశ కౌన్సెలింగ్ గడువు శనివారంతో ముగియనుంది. ఈ నెల 27వ తేదీ సాయంత్రం ఆరు నుంచి 29 వ తేదీ మధ్యాహ్నం 3 గంటల వరకు మాత్రమే వెబ్ ఆప్షన్‌లకు అవకాశం ఇచ్చారు. తొలి రెండు దశల్లో తేదీలపై స్పష్టత లేక అభ్యర్థులు కౌన్సెలింగ్‌కు హాజరు కాలేక అవకాశాలు చేజార్చుకున్నారు. ఈ నేపథ్యంలో 3వ దశ కౌన్సెలింగ్‌కు ప్రాధాన్యత సంతరించుకుంది. ఈ ఏడాది జూలై 27న నిర్వహించిన ఏపీఎన్ సెట్ పరీక్ష రాసి ఉత్తీర్ణులైనవారు అర్హులు. సీట్లు భారీగా మిగిలిపోవడం వల్ల కటాఫ్ మార్కులను 17కు తగ్గిస్తూ డాక్టర్ ఎన్టీఆర్ హెల్త్ వర్శిటీ నిర్ణయం తీసుకుంది. అధికారుల తీరు విద్యార్థులను గందరగోళానికి గురిచేస్తోంది. కీలక తేదీల ప్రకటన వేళ, మార్పుల వేళ ఎటువంటి క్షేత్రస్థాయి సమాచారం ఇవ్వకుండా విద్యార్థుల భవిష్యత్‌తో ఆడుకుంటున్నారని విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

మేడపై నుంచి పడి మహిళకు తీవ్ర గాయాలు

- సామర్లకోట మెడికవర్ ఆసుపత్రికి తరలింపు

సామర్లకోట, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా సామర్లకోట విద్యుత్ సబ్‌స్టేషన్ వద్ద గల ఏఏవో కార్యాలయం మేడపై నుంచి ప్రమాదవశాత్తు సుమారు 50 సంవత్సరాల వయసు గల స్వీపర్ జారిపడి తీవ్రంగా గాయపడింది. వివరాల్లోకి వెళితే... రాజమహేంద్రవరానికి చెందిన ఈమె ఇటీవల కారుణ్య నియామకాలలో ఏఏవో కార్యాలయంలో స్వీపరుగా చేరింది. తీవ్రంగా గాయపడిన ఈమెను ఏడీబీ రోడ్డులో గల మెడికవర్ ఆసుపత్రికి చికిత్స నిమిత్తం తరలించారు. ప్రమాద పరిస్థితులు లేవని, కోలుకునేందుకు కొద్దిరోజులు పడుతుందని వైద్యులు పేర్కొన్నట్టు సహచర ఉద్యోగులు తెలిపారు.

రాష్ట్ర స్థాయి షటిల్ బ్యాడ్మింటన్

పోటీల్లో రిత్వికకు రజత పతకం


రుత్వికను అభినందిస్తున్న జిల్లా విద్యాశాఖాధికారి సలీంబాషా

అమలాపురం టౌన్, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): మచిలీపట్నంలో జరిగిన రాష్ట్ర స్థాయి స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ షటిల్ బ్యాడ్మింటన్ పోటీల్లో అమలాపురం మహాత్మాగాంధీ మున్సిపల్ ఉన్నత పాఠశాల విద్యార్థిని మేడిచర్ల రిత్విక తృతీయస్థానం సాధించి రజత పతకం దక్కించుకుంది. ఈసందర్భంగా శుక్రవారం జిల్లా విద్యాశాఖాధికారి డాక్టర్ షేక్‌సలీంబాషా ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో రిత్వికను పలువురు అభినందించారు. కార్యక్రమంలో డీసీఈబీ కార్యదర్శి బీర హనుమంతరావు, ఎస్ఎంసీ చైర్మన్ మలిశెట్టి వీరాస్వామి, ఉపాధ్యాయులు బీఎస్ వెంకటేశ్వరరావు, రాయుడు శ్రీనివాసరావు, కేఆర్ఎన్ ప్రసాద్, ఎం.చంద్రమోహన్‌లతో పాటు బొరుసు వీవీ సుబ్రహ్మణ్యం, తదితరులు పాల్గొన్నారు.

జ్యుడీషియల్ క్రికెట్ టోర్నమెంట్

కాకినాడ బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో పోటీలు


బ్యాటింగ్ చేసి టోర్నమెంట్‌ను ప్రారంభిస్తున్న జడ్జి ఆనందిని

కార్పొరేషన్ (కాకినాడ), నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): కాకినాడ బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో న్యాయమూర్తులు, న్యాయవాదుల క్రికెట్ టోర్నమెంట్ శుక్రవారం కాకినాడ రంగరాయ మెడికల్ కళాశాల గ్రౌండ్‌లో ఘనంగా ప్రారంభమైంది. కాకినాడ మూడో అదనపు జిల్లా జడ్జి జి.ఆనందిని క్రికెట్ మ్యాచ్‌ను ప్రారంభించారు. ఏడు పురుషుల జట్లు, రెండు మహిళల జట్లు పోటీలో నిలబడగా తొలి రోజు దివ్య వర్సెస్ దుర్గ జట్లు తలపడగా దివ్య జట్టు విజయం సాధించింది.పురుషుల జట్టు నుంచి వైఎస్ఎం,సునీల్‌కాంత్ జట్లు పోటీల్లో తలపడగా వైఎస్ఎం జట్టు విజయం సాధించింది.మోహన మురళి, ఆర్‌వీఎస్ జట్లు తలపడగా మోహనమురళి జట్టు విజయం సాధించింది. ఈ సందర్భంగా జడ్జి ఆనందిని మాట్లాడుతూ కాకినాడ బార్ అసోసియేషన్‌లో తొలిసారిగా న్యాయమూర్తులు న్యాయవాదులు కలిసి ఆడ డం శుభపరిణామమన్నారు. ప్రస్తుతం మహిళలు క్రికెట్‌లో వరల్డ్ కప్ సాధించారని అలాగే కాకినాడ బార్ అసోసియేషన్ మహిళా న్యాయవాదులు కూడా క్రికెట్‌లో రాణించాలని ఆకాంక్షించారు. కాకినాడ బార్ అసోసియేషన్ అధ్యక్షులు ఏలూరు సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ ఉభయ తెలుగు రాష్ట్రాల్లో తొలిసారిగా న్యాయమూర్తులు, న్యాయవాదులు కలిసి క్రికెట్ ఆడడం కాకినాడ బార్ అసోసియేషన్‌తో ప్రారంభమైందన్నారు. మూడు రోజులు పాటు సాగే ఈ క్రికెట్ మ్యాచ్‌లు ఆదివారం ముగుస్తాయి. కార్యక్రమంలో జనరల్ కార్యదర్శి చెక్కపల్లి వీరభద్రరావు(చంటి), స్టేట్ బార్ కౌన్సిల్ మెంబర్ నరహరిశెట్టి రవికృష్ణ, జిల్లా క్రికెట్ అసోసియేషన్ కార్యదర్శి నక్కా వెంకటేష్, బార్ స్పోర్ట్స్ అండ్ కల్చర్ సెక్రటరీ జోకా విజయ్‌కుమార్, ఇతర ఎగ్జిక్యూటివ్ కమిటీ సభ్యులు, సీనియర్ న్యాయవాదులు పాల్గొన్నారు.


మ్యాచ్ ఆడుతున్న న్యాయవాదులు

తూర్పుకాపులకు ఓబీసీ సర్టిఫికెట్ల మంజూరుకు కృషి

తూర్పుకాపు అభివృద్ధి కార్పొరేషన్ చైర్‌పర్సన్ పాలవలస

రాజమహేంద్రవరం సిటీ, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): తూర్పుగోదావరి జిల్లాలోని తూర్పుకాపు విద్యార్థులకు ఓబీసీ సర్టిఫికెట్ల కోసం పడుతున్న ఇబ్బందులు తొలగించి వారికి సర్టిఫికెట్లు మంజూరు చేయించేందుకు కృషి చేస్తానని రాష్ట్ర తూర్పు కాపు అభివృద్ధి కార్పొరేషన్ చైర్‌పర్సన్ పాలవలస యశస్వి హామీ ఇచ్చారు. జిల్లా పర్యటనలో భాగంగా శుక్రవారం ఆమె రాజమహేంద్రవరం వచ్చారు. ఈ సందర్భంగా రౌతు తాతాలు కళ్యాణమండపంలో సంఘం కార్యదర్శి మజ్జి రాంబాబు అధ్య క్షతన జరిగిన సమావేశంలో యశ్వసి మాట్లాడుతూ జిల్లాలో తూర్పు కాపు విద్యార్థులను చిన్నచూపు చూస్తు న్న సంఘటనలు తనకు బాధ కలిగిస్తున్నాయని వారికి ఎదురవుతున్న ఇబ్బందులు తొలగించడానికి అవరసమైన చర్యలు తీసుకుంటామన్నారు. ఓబీసీ సర్టిఫికెట్ మంజూరయ్యేలా చర్యలు తీసుకుంటామన్నారు.ఈ సందర్భంగా చైర్‌పర్సన్‌ను సత్కరించారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే రౌతు సూర్యప్రకాశరావు, పతివాడ రామరాజు, లంక సత్యనారాయణ, యజరపు మరిడియ్య, ఆర్.వెంకట్రావు తదితరులు పాల్గొన్నారు.

అమ్మో.. ఎంత పెద్ద తాచుపామో!



అమలాపురం రూరల్, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): బండారులంకలో శుక్రవారం గోరు లావణ్యవతి ఇంట్లోని ఫ్రిజ్‌లోకి తాచుపాము దూరింది. తెలియక తలుపు తీయగానే ఆ పాము బుసలు కొట్టింది. దాంతో ఇంట్లోని వ్యక్తులంతా భయభ్రాంతులకు గురై వెంటనే స్నేక్ క్యాచర్ జంపన గణేష్‌వర్మకు సమాచారం అందించగా అరగంట సేపు శ్రమించి చాకచక్యంగా ఆ పామును బంధించి సురక్షిత ప్రాంతంలో విడిచిపెట్టారు.

జాతీయ జంబోరీలో

రాజమండ్రి రైల్వే స్కౌట్స్


జంబోరీలో పాల్గొన్న రాజమండ్రి రైల్వే స్కౌట్స్

రాజమహేంద్రవరం, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): లక్నోలో జరుగుతున్న జాతీయ స్కౌట్స్ అండ్ గైడ్స్ జాతీయ జంబోరీలో రాజమండ్రి రైల్వే స్కౌట్స్ అండ్ గైడ్స్ విద్యార్థులు పాల్గొన్నారు.జంబోరీని 23న ప్రధాని మోదీ ప్రారంభించగా.. 29న(నేడు) ముగింపు కార్యక్రమానికి రాష్ట్రపతి ద్రౌపది ముర్ము హాజరు కానున్నారు. జాతీయ జంబోరీలో పాల్గొనడం ప్రతిష్టాత్మకంగా స్కౌట్స్ భావిస్తారు. దీనిలో పాల్గొన్న వాళ్లకు కేంద్ర ప్రభుత్వ ఉద్యోగాల్లో రిజర్వేషను వర్తిస్తుంది. రాజమండ్రి నుంచి కె.రేషిత,ఎ.హర్షవి.సాత్విక, పీబీవీఎస్ కళ్యాణ్, ఎం.చందన్ శివసాయి పాల్గొన్నారు.

డ్రంకెన్ డ్రైవ్ కేసుల్లో ఐదుగురికి జైలు

రాజమహేంద్రవరం, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): డ్రంక్ అండ్ డ్రైవ్ కేసుల్లోని నిందితులకు కోర్టు జైలు శిక్ష, జరిమానాలు విధించింది. మద్యం తాగి వాహనం నడుపుతూ పట్టుబడిన 12 మందిని పోలీసులు కోర్టులో హాజరు పరి చారు. ఏడుగురికి రూ.10వేల చొప్పున, ఒకరికి ఒక రోజు, ఇద్దరికి రెండు రోజులు, మరో ఇద్దరికి మూడు రోజుల జైలు శిక్ష విధిస్తూ 3వ ఏజేఎఫ్‌సీ మేజిస్ట్రేటు సి.రమ్య ఉత్తర్వులిచ్చారు.

క్రీడలతో సంపూర్ణ ఆరోగ్యం

- కాకినాడ డీఈవో రమేష్
- నెలాఖరు వరకు జిమ్నాస్టిక్ పోటీలు
- 10 జిల్లాల నుంచి 400 మంది క్రీడాకారులు హాజరు


పోటీలను ప్రారంభిస్తున్న కాకినాడ డీఈవో రమేష్

కార్పొరేషన్ (కాకినాడ), నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు క్రీడల్లో పాల్గొనడం వల్ల సంపూర్ణ ఆరోగ్యం చేకూరుతుందని కాకినాడ జిల్లా విద్యా శాఖ అధికారి పి.రమేష్ తెలిపారు. శుక్రవారం కాకినాడలోని జిల్లా క్రీడా మైదానంలో రాష్ట్రస్థాయి ఎస్‌జీఎఫ్ఐ అంతర్ జిల్లా జిమ్నాస్టిక్ పోటీలు ప్రారంభమయ్యాయి. డీవైఈవో సత్యనారాయణ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి డీఈవో ముఖ్యఅతిథిగా విచ్చేసి మాట్లాడారు. ఈ ఏడాది ఎస్‌జీఎఫ్ఐ ఆధ్వర్యంలో ఐదు రాష్ట్రస్థాయి మీట్‌లు నిర్వహిస్తున్నామన్నారు. ఈ నెల 30 వరకు జరిగే పోటీలకు 10 జిల్లాల నుంచి 400మంది క్రీడాకారులు హాజరయ్యారని ఎస్‌జీఎఫ్ఐ అడ్మిన్ కార్యదర్శి సుధారాణి తెలిపారు. డీఎస్‌డీవో సతీష్‌కుమార్ మాట్లాడుతూ కాకినాడలో జాతీయస్థాయి ప్రమాణాల జిమ్నాస్టిక్ స్టేడియం ఉందని వచ్చే ఏడాది జాతీయ పోటీలను కాకినాడకు కేటాయించేలా చూడాలని కోరారు. డీఈవో రమేష్ జాతీయ జెండా, డీఎస్‌డీవో ఎస్‌జీఎఫ్ఐ జెండాలను ఆవిష్కరించారు. క్రీడాకారుల కవాతును స్వీకరించిన అనంతరం బెలూన్లు ఎగురవేసి పోటీలను ప్రారంభించారు. సెయింటాన్స్ పాఠశాల విద్యార్థుల యోగాసనాలు ఆకట్టుకున్నాయి.కార్యక్రమంలో జిమ్నాస్టిక్స్ సంఘ అధ్యక్షుడు ఎం.విశ్వేశ్వరరావు,ఎల్.జార్జి, రవిరాజు, పీడీలు ప్రసాద్, హరిబాబు, సూరిబాబు, కోచ్ సురేష్, ఎంపిక కమిటీ సభ్యుడు శరత్‌చంద్ర,క్రీడాకారిణి యాసిన్, వివిధ జిల్లాల కోచ్‌లు పాల్గొన్నారు.


జిమ్నాస్టిక్ ప్రదర్శన ఇస్తున్న క్రీడాకారుడు


సెయింటన్స్ స్కూల్ విద్యార్థినుల యోగాసనం

రాష్ట్ర బాస్కెట్‌బాల్ పోటీల విజేత తూర్పు


విజేతగా నిలిచిన ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా బాలుర జట్టు

అమలాపురం టౌన్, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): స్కూలు గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో రాష్ట్ర స్థాయిలో నిర్వహించిన బాస్కెట్‌బాల్ పోటీల్లో ఉమ్మడి జిల్లా జట్లు ప్రతిభ చాటి విజేతలుగా నిలిచినట్టు టీమ్‌కోచ్, మేనేజర్ ఐ.భీమేష్ తెలిపారు. విజయవాడ మేరీ స్టెల్లా కళాశాలలో అండర్-19 బాస్కెట్‌బాల్ పోటీలు హోరాహోరీగా జరిగాయి. అనంతపురం జిల్లా జట్టుతో జరిగిన ఫైనల్ ఈ పోటీల్లో ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా బాలుర జట్టు అద్భుత ప్రతిభ చాటి ప్రథమస్థానం సాధించింది. ఈ జట్టుకు రామచంద్రపురానికి చెందిన తేజస్వరూప్ కెప్టెన్‌గా వ్యవహరించారు.అలాగే ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా బాలికల జట్టు రాష్ట్రస్థాయిలో ద్వితీయస్థానం సాధించింది. ఫైనల్స్‌లో కృష్ణా జిల్లా జట్టు తో తలపడి రన్నరప్ సాధించింది. ఈ జట్టుకు అంబాజీపేటకు చెందిన మౌనిక కెప్టెన్‌గా వ్యవహరించింది. ఉమ్మడి జిల్లా జట్లు కోచ్, మేనేజర్లు సునీత, ఎస్వీవీ సత్యనారాయణ, బీటీ త్రినాథవర్మ, వి.నరసింహారావు, ఐ.భీమేష్ వ్యవహరించారు.

రాష్ట్ర గట్కా పోటీలకు పందలపాక విద్యార్థినులు


రాష్ట్ర గట్కా పోటీలకు ఎంపికైన పందలపాక విద్యార్థినులు

బిక్కవోలు, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): తూర్పుగోదావరి జిల్లా పందలపాక ఉన్నత పాఠశాల నుంచి ఎస్‌జీఎఫ్ రాష్ట్ర స్థాయి గట్కా పోటీలకు ఆరుగురు విద్యార్థినిలు ఎంపికైనట్టు హెచ్ఎం చిర్ల శ్రీనివాసరెడ్డి తెలిపారు. ఎంపికైన వారిలో అండర్-17 నుంచి ఇమ్మంది సత్యహరిణి, కొమ్ము జాహ్నవి, నూలు అపర్ణ, భవ్యశ్రీ అండర్-19 నుంచి గొలుగూరి శ్రావ్యరెడ్డి, దేవాది అలేఖ్య వున్నారు. వీరు ఈ నెల 29 నుంచి కర్నూలు జిల్లా ఎమ్మిగనూరులో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా తరపున పాల్గొంటారని హెచ్ఎం తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థినులను, తీర్చిదిద్దిన పీడీ యువరాజారెడ్డి, భీమేశ్వర్‌రెడ్డిను హెచ్ఎంతో పాటు పాఠశాల అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు కోణాల సత్తిరాజు, ఎస్ఎంసీ చైర్మన్ పంపన వీరసత్యనారాయణ, ఉపాధ్యాయులు అభినందించారు.

అంతర్వేది నరసన్న హుండీ ఆదాయం రూ.47,48,861


హుండీల ఆదాయాన్ని లెక్కిస్తున్న దృశ్యం

అంతర్వేది, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): నవ నారసింహ క్షేత్రాల్లో ఒకటైన అంతర్వేది శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయంలో శుక్రవారం హుండీ ఆదాయాన్ని లెక్కించారు. 78 రోజులకుగాను ఈ హుండీ ఆదాయాలను జిల్లా డీసీ వి.సత్యనారాయణ పర్యవేక్షణలో అమలాపురం తనిఖీ అధికారి జె.రామలింగేశ్వరరావు ఆధ్వర్యంలో లెక్కించినట్టు ఏసీ ఎంకేటీఎస్వీ ప్రసాద్ తెలిపారు. స్వామివారి ప్రధాన ఆలయ హుండీ ద్వారా రూ.46,61,265, గుర్రాలక్కమ్మ ఆలయ హుండీ ద్వారా రూ.19,774, అన్నదాన హుండీ ద్వారా రూ.67,823 మొత్తం హుండీల ఆదాయం రూ.47,48,861 వచ్చిందని ఆయన తెలిపారు. ఈ సందర్భంగా 2గ్రాముల బంగారం, 23గ్రాముల వెండి వస్తువులు, పలు దేశాల కరెన్సీ నోట్లు లభ్యమయ్యాయని తెలిపారు. కార్యక్రమంలో ఎంపీటీసీ బైరా నాగరాజు, సర్పంచ్ కొండా జాన్‌బాబు, భక్తులు, విశ్వహిందూపరిషత్ సభ్యులు పాల్గొన్నారు.

• రాజమహేంద్రవరం సిటీ/ రూరల్ • రాజానగరం • అనపర్తి

ఉపాధ్యాయులకు ఆటల పోటీలు

కోరుకొండ, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): స్థానిక ప్రభుత్వ ప్రాథమిక, జడ్పీ ఉన్నత పాఠశాలల ఉపాధ్యాయులకు ఆటల పోటీలు నిర్వహిస్తున్నట్టు మండల విద్యాశాఖాధికారి టి.కుశలవదొర తెలిపారు. ఈ నెల 29, 30 తేదీల్లో మండల స్థాయిలో పురుషులకు క్రికెట్, మహిళలకు త్రోబాల్, డిసెంబరు 13, 14 తేదీల్లో డివిజన్, జిల్లా స్థాయిల్లో డిసెంబరు 20,21,22 తేదీల్లో రాష్ట్రస్థాయిలో నిర్వహించాలని ప్రభుత్వం సంకల్పించిందన్నారు. క్రికెట్, త్రోబాల్ ఆటల్లో పాల్గొనే ఆసక్తి ఉన్న ఉపాధ్యాయులు ఈ నెల 29వ తేదీ ఉదయం 10గంటలకు పురుష ఉపాధ్యాయులు దోసకాయలపల్లి జడ్పీ హైస్కూల్, మహిళా ఉపాధ్యాయులు కోరుకొండ ప్రభుత్వ హైస్కూల్‌లో హాజరు కావాలన్నారు. అలాగే ఉదయం 9 గంటలకు ఆయా పాఠశాలలకు పురుష, మహిళ వ్యాయామ ఉపాధ్యాయులు పంపాలని ప్రధానోపాధ్యాయులను కోరారు.

బుచ్చింపేటలో అగ్నిప్రమాదం.. పక్కా ఇల్లు దగ్ధం

కోరుకొండ, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): మండలంలోని బుచ్చింపేటలో శుక్రవారం జరిగిన అగ్నిప్రమాదంలో చంద్రు శ్రీనివాసరావుకు చెందిన మూడు పోర్షన్ల పక్కా ఇల్లు దగ్ధమైంది. ఇంటిలోంచి ఒక్కసారిగా మంటలు ఎగిసి పడటంతో ఈ ప్రమాదం జరిగిందని స్థానికులు చెబుతున్నారు. విద్యుత్ షార్ట్ సర్క్యూట్ వల్లా, ఇంట్లో వెలిగించిన దీపారాధన వల్ల జరిగిందా అని చెప్పలేకపోతున్నారు. ప్రమాద సమయంలో ఇంట్లో ఎవరూ లేకపోవడంతో ప్రాణనష్టం జరగలేదు. సామాన్లు, గృహోపకరాలు పూర్తిగా దగ్ధమయ్యాయి. ఆ ఇంట్లో నివాసం ఉంటున్న చంద్రు సత్యనారాయణ, చంద్రు శ్రీనివాస్, చంద్రు సూర్యనారాయణ, అడబాల జయమ్మ కుటుంబాల వారు నిరాశ్రయులయ్యారు. ప్రమాద విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ బాధితులను పరామర్శించారు. అన్ని విధాలా ఆదుకుంటామని హామీఇచ్చారు. పరామర్శించిన వారి సర్పంచ్ సాదేపల్లి జ్యోతి, కూటమి నాయకులున్నారు.

ఉపాధ్యాయులకు బోధనేతర పనులు తొలగించాలి

ఎమ్మెల్సీ గోపీమూర్తి



కార్యక్రమంలో ప్రసంగిస్తున్న ఎమ్మెల్సీ గోపీమూర్తి

సీతానగరం, నవంబరు 28(ఆంధ్రజ్యోతి) ఉపాధ్యాయులకు బోధనేతర పనులు తొలగించాలని ఉపాధ్యాయ ఎమ్మెల్సీ బొర్రా గోపీమూర్తి అన్నారు. శుక్రవారం మండలంలోని రఘుదేవపురం ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయుడు సబ్బితి రాజు పదవీ విరమణ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా విచ్చేసి మాట్లాడారు. ఉపాధ్యాయులకు బోధనేతర పనులు అప్పగించడం వల్ల ద్వారా వారికి ఒత్తిడి పెరిగి విద్యార్థులకు పూర్తి న్యాయం చేయలేకపోతున్నారని, వారికి అదనపు బాధ్యతలు తీసివేయాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా రాజు సేవలను కొనియాడారు. అంతకుముందు పదవీ విరమణ చేసిన రాజు, రాజరాజేశ్వరి దంపతులను సన్మానించారు.కార్యక్రమంలో యూటీఎఫ్ నాయకులు పి.జయశంకర్, ఈ.శ్రీమణి, ఆర్.పాపారావు, ఎం.పోశియ్య,కె.నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

వైద్య విద్యార్థులకు క్రీడలూ ముఖ్యమే

రాజానగరం, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): వైద్య విద్యార్థులకు చదువుతోపాటు క్రీడలు ముఖ్యమేనని ఎన్టీఆర్ ఆరోగ్య విశ్వవిద్యాలయం ఉపకులపతి డాక్టర్ పి.చంద్రశేఖర్ అన్నారు. ఎన్టీఆర్ ఆరోగ్య విశ్వవిద్యాలయం పరిధిలోని వైద్య అంతర్ కళాశాలల పురుషుల క్రీడా పోటీలు-2025 స్థానిక జీఎస్ఎల్ వైద్యకళాశాలలో గురువారం ప్రారంభమయ్యాయి. మూడు రోజులపాటు జరిగే ఈ పోటీల ప్రారంభ కార్యక్రమానికి విచ్చేసిన వీసీ చంద్రశేఖర్ విద్యార్థులు కనీసం రోజుకు ఒక గంట సమయం క్రీడలకు కేటాయిస్తే ఒత్తిడి దూరమై మనస్సు ప్రశాంతంగా ఉంటుందన్నారు. ఈ మెగా టోర్నమెంట్‌లో రాష్ట్రంలోని 35 వైద్య కళాశాలల నుంచి 810 మంది క్రీడాకారులు పాల్గొంటున్నారని జీఎస్ఎల్ వైద్యకళాశాల పీడీ శ్రీనివాసులు తెలిపారు. మొదటి విడతలో వాలీబాల్,ఫుట్‌బాల్, టెన్నిస్, చెస్ పోటీలు నిర్వహిస్తున్నారు. కార్యక్రమంలో జీఎస్ఎల్ వైద్యసంస్థల ఛైర్మన్ డాక్టర్ గన్నిభాస్కరరావు, ప్రిన్సిపాల్ డాక్టర్ వి.గురుమూర్తి, సూపరింటెండెంట్ డాక్టర్ టీవీఎస్‌పీ మూర్తి, వైస్‌ప్రిన్సిపాల్ శ్రీనివాస్ పాల్గొన్నారు.

పలుకును సందర్శించిన ఎంపీ పురందేశ్వరి



విద్యార్థులకు దుప్పట్లు పంపిణీ చేస్తున్న ఎంపీ పురందేశ్వరి

ధవళేశ్వరం, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): స్థానిక పలుకు బధిరుల ఆశ్రమ పాఠశాలను ఎంపీ దగ్గుబాటి పురందేశ్వరి శుక్రవారం సాయంత్రం సందర్శించారు. పాఠశాలలో విద్యార్థులకు అందుతున్న సౌకర్యాలు, ప్రత్యేక విద్యాబోధన తదితర అంశాలను పరిశీలించి పాఠశాల నిర్వాహకురాలు గంటా కనకదుర్గ, సత్యనారాయణలను అభినందించారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ మంచి కార్యక్రమాలు చేయలేకపోయినా ఇటువంటి కార్యక్రమాల్లో పాల్గొనడం వల్ల మంచి ఫలితాలు వస్తాయని తన తండ్రి ఎన్టీఆర్ అంటూ ఉండేవారని గుర్తు చేసుకున్నారు. దివ్యాంగులకు తిరుమలలో ఆన్‌లైన్ నమోదు లేకుండా స్వామివారి దర్శనం అయ్యే విధంగా ఏర్పాటు చేయడానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. అనంతరం పాఠశాలకు బీరువా బహూకరించి విద్యార్థులకు దుప్పట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు పిక్కి నాగేంద్ర, పరిమి రాధ, ఆకుల శ్రీధర్, నర్సిపల్లి హారిక, రొంపిచర్ల ఆంటోని, యానాపు ఏసు, ఒంటెద్దు స్వామి, సీహెచ్ సతీష్ పాల్గొన్నారు.

నేడు అనపర్తిలో ఎంపీ పర్యటన

అనపర్తి, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): అనపర్తిలో శనివారం ఎంపీ పురందేశ్వరి పర్యటించనున్నట్టు ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి తెలిపారు. మధ్యాహ్నం 3గంటలకు రామవరంలోని జరిగే ఆత్మ నిర్భర్ భారత్ సంకల్ప అభియాన్ కార్యక్రమంలో పాల్గొంటారని, మహిళలతో సమీక్ష నిర్వహిస్తారని చెప్పారు.

ప్రజా సంక్షేమమే లక్ష్యం: ఎమ్మెల్యే బత్తుల



కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే బత్తుల

సీతానగరం, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): ప్రజా సంక్షేమం, నియోజకవర్గ అభివృద్ధే లక్ష్యమని ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ అన్నారు. శుక్రవారం మండలంలోని వంగలపూడిలో నిర్వహించిన ప్రజాదర్బార్ కార్యక్రమానికి ఆయన విచ్చేసి మాట్లాడారు.ప్రజా సమస్యలు తెలుసుకునేందుకు ముందస్తు ప్రణాళికతో ప్రజావేదిక కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. గ్రామాల్లో విద్య, వైద్యం, వీధి లైట్లు, రోడ్లు, డ్రైనేజీ, సంక్షేమ పథకాలు, తాగునీరు, సాగునీరు వంటి సమస్యలు పరిష్కరించామన్నారు. కార్యక్రమంలో ప్రజల నుంచి అర్జీలను స్వయంగా స్వీకరించారు. కార్యక్రమంలో సర్పంచ్ కుంచే అన్నపూర్ణ, తహశీల్దార్ శ్రీనివాస్, నాయకులు గద్దే వెంకటకృష్ణ చౌదరి, మట్ట వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

ఎల్ఆర్ఎస్, బీపీఎస్‌లపై అవగాహన కల్పించండి

కమిషనర్ రాహుల్‌మీనా

రాజమహేంద్రవరం సిటీ, నవంబరు28(ఆంధ్రజ్యోతి): రాజమహేంద్రవరంలో అనుమతులకు విరుద్ధంగా చేపట్టిన భవనాలు, అనధికారికంగా వేసిన లేఅవుట్లకు వారం రోజుల్లోగా నోటీసులు జారీ చేయాలని నగర పాలక సంస్థ కమిషనర్ రాహుల్‌మీనా ఆదేశించారు. నగరపాలక సంస్థ కార్యాలయంలో శుక్రవారం పట్టణ ప్రణాళిక విభాగం అధికారులు, సిబ్బందితో ఎల్ఆర్ఎస్, బీపీఎస్‌లపై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ బీపీఎస్(బిల్డింగ్ పీనలైజేషన్ స్కీం)-2025, ఎల్ఆర్ఎస్(లేఅవుట్ రెగ్యులరైజేషన్ స్కీం-2020 పై సుదీర్ఘంగా చర్చించారు. ప్లానింగ్ సెక్రటరీలు క్షేత్రస్థాయిలో తనిఖీలు నిర్వహించి అనధికార నిర్మాణాలు, అక్రమ లేఅవుట్లు గుర్తించి నోటీసులు ఇవ్వాలన్నారు.అలాగే ఎల్ఆర్ఎస్, బీపీఎస్ స్కీంలకు సంబంధించి భవన యజమానులకు అవగాహన కల్పిస్తూ, క్రమబద్ధీకరించుకునేలా చూడాలన్నారు.ఇటీవల విడుదల చేసిన జీవో ఎంఎస్ నెం 225 ద్వారా జనవరి 1, 1985 నుంచి ఆగస్టు 31 2025 మధ్యకాలంలో నిర్మించిన అనధికార భవనాలకు బీపీఎస్ ద్వారా క్రమబద్ధీకరిస్తామన్నారు. గడువు అనంతరం క్రమబద్ధీకరించుకోని భవనాలపై చట్ట పరమైన చర్యలు తీసుకోవడం, డిమాలిషన్ చేస్తామన్నారు. అలాగే కట్టడాలకు సంబంధించిన విద్యుత్ సరఫరా నీటి సరఫరా, డ్రైనేజీ అనుమతులు ఇవ్వబడవని తెలిపారు. అలాగే బహుళ అంతస్తులు భవనాలు నిర్మించే వారు తప్పకుండా పార్కింగ్ ప్రదేశం కేటాయించుకోవాలని కమిషనర్ సూచించారు. ఆయన వెంట కార్పొరేషన్ అధికారులు ఉన్నారు.

రాఘవాపురంలో రైతులకు అవగాహన కల్పించిన ఆర్డీవో

కోరుకొండ, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): మండలంలోని రాఘవాపురంలో వరి పొలాలను, కళ్లాల్లో ఆరబెట్టిన ధాన్యాన్ని శుక్రవారం ఆర్డీవో కృష్ణనాయక్ పరిశీలించారు. వ్యవసాయ శాఖ అధికారులకు ట్రక్ షీట్లు సిద్ధం చేసి నిర్ణీత రైస్ మిల్లులకు పంపాలని ఆదేశించారు. అలాగే ధాన్యం కొనుగోలు విషయమై దళారుల మాటలు నమ్మి మోసపోవద్దని రైతులకు సూచించారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం ధాన్యానికి సంబంధించిన మొత్తం సొమ్ము నిర్ణీత కాల వ్యవధిలో సంబంధిత రైతుల బ్యాంకు ఖాతాల్లో జమ చేయబడుతుందని అవగాహన కల్పించారు. కార్యక్రమంలో తహశీల్దార్ సుస్వాగతం, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

రాజమహేంద్రవరం

జ్యోతిరావ్ ఫూలే ఆశయాలు..

ప్రజల్లోకి తీసుకెళ్తాం

» జయంతి నాడు ఫూలే స్మారక అవార్డులు ప్రదానం చేస్తాం
» వర్ధంతి కార్యక్రమంలో బీసీ,ఎస్సీ, ఎస్టీ,మైనార్టీ సంక్షేమ సంఘం



రాజమండ్రిలో ఫూలే చిత్రపటానికి న్యాయవాదుల నివాళులు

రాజమహేంద్రవరం సిటీ, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): మహాత్మా జ్యోతిరావు ఫూలే ఆశయాలను ప్రజల్లోకి తీసుకెళ్తామని బీసీ,ఎస్సీ,ఎస్టీ, మైనార్టీ సంక్షేమ సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు సానబోయిన రామారావు అన్నారు. ఫూలే 135 వర్ధంతి సందర్భంగా శుక్రవారం స్థానిక ఏవీ అప్పారావు రోడ్డులోని ఫూలే విగ్రహానికి ఆయనతోపాటు సంఘం ఛైర్మన్ గుమ్మడి సమర్పణరావు, వైస్ ఛైర్మన్ ఎల్‌వీ ప్రసాద్, జిల్లా అధ్యక్షుడు బి.జార్జ్ ఆంటోని పూ లమాలలతో నివాళులర్పించారు.ఈ సందర్భంగా రామారావు మాట్లాడుతూ తమ సంఘం ఆధ్వర్యంలో ఇస్తున్న ఫూలే స్మారక పురస్కారం కోసం విశిష్ట గుణాలున్న వారి వివరాలు సేకరిస్తున్నామన్నారు. ఏప్రిల్‌లో జరిగే ఫూలే జయంతి రోజున పురస్కారం అందిస్తామన్నారు. సమర్పణరావు మాట్లాడుతూ అణగారిన వర్గాలకు విద్య అవసరాన్ని గుర్తించిన ఫూలే వారిని విద్యావంతులుగా తీర్చిదిద్దడానికి కృషి చేశారన్నారు. ఈ సందర్భంగా నాటి సమాజంలో ఫూలే దంపతులకు ఎదురైన ఇబ్బందులు, అవమానలను వివరించారు.కార్యక్రమంలో సంఘం నాయకులు బత్తిన ఏడకొండలు, పలివెల సత్యనారాయణ, కోనాల లాజరు, బీఎస్‌వీ ప్రతాప్ పాల్గొన్నారు.

రాజమహేంద్రవరం కల్చరల్: రాజమండ్రి బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో గోకవరం బస్టాండు వద్ద కోర్టు ఆవరణలోని బార్ అసోసియేషన్ హాల్‌లో జరిగిన కార్యక్రమానికి న్యాయవాది సింగ్ సురేంద్ర ప్రసాద్, బార్ అసోసియేషన్ మాజీ అధ్యక్షుడు రమణమూర్తి, తలాటం శ్రీనివాస్, దర్నాలకోట వెంకటేశ్వరరావు, కొత్తూరు ఆనంద్‌కుమార్, ఎంవీబీ సత్యనారాయణ, సూరంపూడి శ్రీనివాస్, అంబటి మురళీకృష్ణ, డీఎస్పీ రాజగోపాల్ తదితరులు పాల్గొని ఫూలే చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. స్థానిక గోదావరి గట్టున ఉన్న ఫూలే విగ్రహానికి ఫూలే సామాజిక చైతన్య వేదిక ఆధ్వర్యంలో నివాళులర్పించారు. ట్రాన్స్‌కో సూపరింటెండెంట్ ఇంజనీర్ కె.తిలక్‌కుమార్ ముఖ్య అతిథిగా విచ్చేశారు. ఈ సందర్భంగా భారత రాజ్యాంగం-సవాళ్లు అనే అంశం పై స్థానిక ఫూలే అంబేడ్కర్ భవన్లో సెమినార్ నిర్వహించారు. సామాజిక చైతన్య వేదిక వ్యవస్థాపకుడు నయనాల కృష్ణారావు మాట్లాడుతూ దేశంలో మెజారిటీ వర్గీయులైన బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీలు సమైక్యమై ఫూలే, అంబేడ్కర్ ఆశయాలను సాధించాలని పిలుపునిచ్చారు.మరో ముఖ్య అతిథి అంబేడ్కర్ సేవా కేంద్రం ఛైర్మన్ గుబ్బల రాంబాబు మాట్లాడుతూ ప్రజల సమ్మతి లేకుండా కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అనేక సంస్కరణల చేస్తున్నాయని, తటస్థులు, మేధావులు, ప్రజాసామ్యవాదులు ఏకమై ప్రజా వ్యతిరేక నిర్ణయాలను వెనక్కు తీసుకునేలా ప్రభుత్వాలపై ఒత్తిడి తేవాలన్నారు. కార్యక్రమంలో కేకే సంజీవరావు, ఇసుకపట్ల రాంబాబు, కేఎస్ఎన్ మూర్తి, బీఎస్పీ జిల్లా అధ్యక్షుడు విజయకుమార్, విశ్రాంత అధ్యాపకులు సీహెచ్ కూర్మయ్య, రామ్మోహన్, మార్గాని చంటిబాబు, రేలంగి శేఖర్, ఠాగూర్,దాలిపర్తి వేమన తదితరులు పాల్గొన్నారు.

కడియం: బుర్రిలంక గోకుల్ నర్సరీలో నర్సరీ అధినేత, జాతీయ బీసీ సంక్షేమ సంఘ న్యాయ విభాగ ఉపాధ్యక్షులు డీవీవీఎస్ నారాయణమూర్తియాదవ్ మాట్లాడుతూ బడుగు బలహీన వర్గాల సంక్షేమానికి కృషి చేసిన మహనీయుడు ఫూలే అన్నారు. కార్యక్రమంలో నూనె వెంకటేశ్వరరావు, తూపాటి దుర్గారావు, తానంకి ఏసురత్నం, కానబోయిన నాగేశ్వరరావు, తానంకి రాధ కృష్ణ తదితరులు పాల్గొన్నారు.



మైనార్టీ సంఘం నాయకుల నివాళులు

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

కడియం, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): వేమగిరి సబ్‌స్టేషన్ పరిధిలో వార్షిక మరమ్మతుల వల్ల శనివారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుందని ట్రాన్స్‌కో ఈఈ నటరాజన్ తెలిపారు.ఉదయం 7నుంచి మధ్యాహ్నం 1వరకు కడియం,కడియపుసావరం, జేగురుపాడు, వెంకయ్యపేట, వేమగిరికి సరఫరా నిలిచిపోతుందన్నారు.

ఎస్సీ హాస్టళ్లలో మెరుగైన సౌకర్యాలు కల్పించాలి

» విద్యార్థులను వేధిస్తున్న నెం.1 హాస్టల్ వార్డెన్‌ను సస్పెండ్ చేయాలి » డీఎస్‌డబ్ల్యుఓ కార్యాలయం ఎదుట బీఎస్పీ ధర్నా



సోషల్ వెల్ఫేర్ అధికారి కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్న దృశ్యం

రాజమహేంద్రవరం అర్బన్, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని ఎస్సీ హాస్టళ్లలో మెనూ సక్రమంగా అమలు చేయడంతోపాటు విద్యార్థులకు మెరుగైన సౌకర్యాలు కల్పించాలని, విద్యార్థులను వేధింపులకు గురిచేస్తున్న ఎస్సీ కాలేజీ బాలుర హాస్టల్ నెం.1 లేడీ వార్డెన్‌ను సస్పెండ్ చేయాలని బహుజన సమాజ్ పార్టీ (బీఎస్పీ) నాయకులు డిమాండ్ చేశారు.ఈ మేరకు శుక్రవారం స్థానిక జిల్లా సాంఘిక సంక్షేమాధికారి (డీఎస్‌డబ్ల్యువో) కార్యాలయం, సబ్ కలెక్టర్ కార్యాలయం ఎదుట నిరసన ధర్నా చేశారు. అనంతరం సబ్ కలెక్టర్ కార్యాలయం అధికారులకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా బీఎస్పీ జిల్లా అధ్యక్షుడు పట్నాల విజయకుమార్, జిల్లా కన్వీనర్ నక్కా వెంకటరత్న రాజు, అర్బన్ ఇన్‌ఛార్జి ఇసుకపట్ల రాంబాబు మాట్లాడుతూ నెం.1 హాస్టల్ లేడీవార్డెన్ ప్రభావతి విద్యార్థులకు సరైన ఆహారం పెట్టడంలేదని, విద్యార్థుల మధ్య గ్రూపు తగాదాలు సృష్టిస్తున్నారని ఆరోపించారు. నాణ్యత లేకుండా నీళ్లతో, చారులాంటి ఉడికీ ఉడకని కూరలు పెట్టడంతో పౌష్టికాహారం అందక విద్యార్థులు నీరసించిపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. దీనిపై గతంలో విద్యార్థులు ప్రశ్నిస్తే వారిపై పోలీస్‌స్టేషన్‌లో తప్పుడు ఫిర్యాదులు ఇచ్చి, కేసులు పెడతామంటూ బెదిరింపులకు పాల్పడుతున్నారని పేర్కొన్నారు. ఈ విషయాలన్నింటిపైనా విద్యార్థులు గ్రీవెన్స్‌లో కలెక్టర్‌కు ఫిర్యాదు చేసినా నేటికీ ఎలాంటి చర్యలు లేవని అన్నారు. లేడీవార్డెన్‌కు ఏఎస్‌డబ్ల్యువో, కొందరు నాయకులు కొమ్ముకాస్తూ ఆమెకు వంత పాడుతున్నారని, దళిత విద్యార్థులకు అన్యాయం చేస్తున్నారని ఆరోపించారు. తక్షణమే దర్యాప్తు రిపోర్టును బయట పెట్టాలని, బాధ్యులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. సమస్య పరిష్కారం కాకపోతే నిరసనలు ఉధృతం చేస్తామని వారు స్పష్టం చేశారు. కార్యక్రమంలో మోహనకృష్ణ, కొల్లాటి అబ్బులు, కొండపల్లి సూరిబాబు, కొత్తపల్లి శేఖర్, సురేష్, కె.రామ్మోహన్ పాల్గొన్నారు.

రాజ్యాంగ దినోత్సవం

రాజమహేంద్రవరం అర్బన్, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): భారత రాజ్యాంగం ప్రపంచ దేశాలకు దిక్సూచి అని రాజమహేంద్రవరం ప్రభుత్వ ఆర్ట్స్ కళాశాల రాజనీతిశాస్త్ర విభాగాధిపతి బాబ్జి పోతరాజు అన్నారు. శుక్రవారం రాజమహేంద్రవరంలోని ఎస్‌కేవీటీ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో రాజనీతిశాస్త్ర విభాగం ఆధ్వర్యంలో నిర్వహించిన రాజ్యాంగ దినోత్సవం కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. ప్రజల ఐకమత్యం, భిన్నత్వంలో ఏకత్వం మన దేశానికి పెట్టని కోట అని అన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ బీవీ తిరుపణ్యం, విజయవాడ మేరీ స్టెల్లా కాలేజీ అసిస్టెంట్ ప్రొఫెసర్ జే.సూరయ్య మాట్లాడారు. అధ్యాపకులు సంజీవరావు, హరికృష్ణ, నూకరాజు తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి

» ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ » గోకవరంలో ప్రజా దర్బార్‌కు వెల్లువెత్తిన వినతులు



వినతులు స్వీకరిస్తున్న ఎమ్మెల్యే నెహ్రూ

గోకవరం, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయం వద్ద శుక్రవారం నిర్వహిం చిన ప్రజా దర్బార్ కార్యక్రమానికి ప్రజల నుంచి అనూహ్య స్పందన లభించింది. ఎమ్మెల్యే నెహ్రూ విచ్చేసి స్వయంగా ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. ఈ సందర్భంగా సంబంధిత అధికారులను సభా వేదిక వద్దకు పిలిచి సమస్య తీవ్రతను బట్టి పరిష్కరించాలని గడువు విధించారు. లేనిపక్షంలో చర్యలు తప్పవని హెచ్చరించారు. సుమారు 720 వినతులు ఎమ్మెల్యేకు అందాయి. వాటిలో కొన్ని.. గోకవరంలోని డ్రైవర్స్ కాలనీలో తాగునీటి ఎద్దడి నెలకొందని, కొన్ని రోజులుగా సత్యసాయి వాటర్ సరఫరా కావడం లేదని, డ్రైనేజీలు లేక రోడ్లపైనే మురుగునీరు పారుతుందని, సొంత స్థలాలు లేక అద్దె ఇళ్లల్లో నివాసం ఉంటున్నామని స్థానికులు ఎమ్మెల్యే వద్ద వాపోయారు. ఠాణా సెంటర్ వద్ద పురాతన వంతెన స్థానంలో కొత్తది నిర్మించాలని, గ్రామంలో అర్హులందరికీ ఇళ్ల స్థలాలు కేటాయించాలని స్థానిక వైసీపీ నాయకులు వినతిపత్రం అందజేశారు. వేలిముద్రలు పడకపోవడంతో తనకు రేషన్ సరుకులివ్వడం లేదని అనంతపల్లి రత్నమాల ఎమ్మెల్యేకు వివరించింది. ఇంకా ఇళ్ల స్థలాలు, డ్రైనేజీల నిర్మాణం తదితర అంశాలపై పలువురు అర్జీలను అందజేశారు. కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు, కూటమి నాయకులు పాల్గొన్నారు.

కోరుకొండలో రామసేన కార్యాలయం

కోరుకొండ, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): కోరుకొండలో విశ్వహిందూ ధర్మపరిరక్షణ, రామసేన కార్యాలయాన్ని రామసేన అధ్యక్షుడు, బీజేపీ నాయకుడు కంబాల శ్రీనివాసరావు శుక్రవారం రాత్రి ప్రారంభించారు.ప్రత్యేక పూజలు జరిపారు. ఈ సందర్భంగా నిర్వహించిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రామసేన సంస్థ ద్వారా నిర్వహిస్తున్న సేవా కార్యక్రమాలను పేదలకు మరింత చేరువ చేసేందుకు కోరుకొండలో ప్రాంతీయ కార్యాలయాన్ని ప్రారంభించామన్నారు. కార్యక్రమంలో నాయకులు వరసాల ప్రసాద్, బత్తుల నానాజీ, దాసరి ధర్మరాజు, పెద్దడా వెంకన్నదొర, కర్రిబండి వెంకటేశ్వరరావు, ఉంగరాల మణిరత్నం, నాగ రమేష్, వీరాంజలి, కటకం చలం తదితరులు పాల్గొన్నారు.

ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాలకు తరలించాలి

జాయింట్ కలెక్టర్ మేఘాస్వరూప్
పలుచోట్ల రైతన్నా మీకోసం

దివాన్‌చెరువు, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి) వాతావరణశాఖ హెచ్చరికలను దృష్టిలో ఉంచుకుని కోతలు పూర్తి చేసిన పంటను వెంటనే కొనుగోలు కేంద్రాలకు తరలించాలని జిల్లా జాయింట్ కలెక్టర్ వై.మేఘాస్వరూప్ అన్నారు. రాజానగరం మండలం జి.ఎర్రంపాలెంలో శుక్రవారం జరిగిన రైతన్నా మీకోసం కార్యక్రమానికి ఆయన విచ్చేసి మాట్లాడారు. రైతులు తమ కష్టానికి తగినంత సంతృప్తిని వ్యక్తం చేస్తూ అనుకున్న మిల్లులకు ధాన్యం పంపిస్తున్నారని తెలిపారు. అలాగే రవాణా, మిల్లు సంబంధిత ఏమైనా సమస్యలు ఉన్నాయా అని రైతులను అడిగారు. సమస్యలు ఏమీలేవని సేకరించిన ధాన్యానికి సంబంధించిన సొమ్ము 24 నుంచి 48 గంటల్లో ఖాతాలలో జమవుతున్నాయని చెప్పారు. జేసీ రైతులతో ముఖాముఖి మాట్లాడుతూ భవిష్యత్‌లో వరికి ప్రత్యామ్నాయ పంటలు సాగు చేయాలని సూచించారు. పంటల మార్పు ద్వారా భూమి ఆరోగ్యం మెరుగుపడుతుందని చెప్పారు. రైతుల సమస్యలు, పంట రవాణా కొనుగోలు కేంద్రాలకు ధాన్యం పంపిణీ వంటి అంశాలపై క్షేత్రస్థాయిలో పరిశీలించడం, అవగాహన కల్పిస్తున్నామన్నారు. జిల్లా వ్యవసాయాధికారి ఎస్.మాధవరావు, డీఎస్‌వో వి.పార్వతి ఇతర అధికారులు పాల్గొన్నారు.



జి.ఎర్రంపాలెంలో రైతులతో మాట్లాడుతున్న జేసీ మేఘాస్వరూప్

నూతన రకాలు సాగు చేసుకోవాలి

కోరుకొండ, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): రైతులు వ్యవసాయంలో నూతన సాంకేతిక పరిజ్ఞానాన్ని ఆకళింపు చేసుకొని నాణ్యమైన, అధిక దిగుబడులు పొందాలని జిల్లా వ్యవసాయ అధికారి ఎస్.మాధవరావు, ఏరువాక కేంద్రం కోఆర్డినేటర్ చల్లా వెంకట నరసింహారావు, ప్రధాన శాస్త్రవేత్త మానుకొండ శ్రీనివాస్ అన్నారు. శుక్రవారం మండలంలోని నరసాపురంలో జరిగిన రైతన్నా మీకోసం కార్యక్రమానికి వారు విచ్చేశారు.ఈ సందర్భంగా మాధవరావు మాట్లాడుతూ నీటి భద్రత, డిమాండ్ ఆధారిత పంటలు, వ్యవసాయ సాంకేతికత, ఫుడ్ ప్రాసెసింగ్ వంటి విషయాలపై అవగాహన కల్పించారు. వ్యవసాయ విశ్వవిద్యాలయం రూపొందించిన కొత్త వరి, మొక్కజొన్న, మినుము, పెసర, నువ్వులు రకాలను వినియోగించుకోవాలన్నారు. యాంత్రీకరణలో భాగంగా డ్రోనులను ఉపయోగించుకోవాలన్నారు. నరసింహారావు మాట్లాడుతూ రైతులు సమగ్ర పోషక యాజమాన్యం పాటించాలన్నారు. పలువురు రైతులు పాల్గొన్నారు.

అలరించిన కూచిపూడి నృత్యాలు



బిక్కవోలు, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): బిక్కవోలు శ్రీకుమారసుబ్రహ్మణ్యేశ్వరస్వామి షష్ఠి ఉత్సవాల్లో భాగంగా శుక్రవారం రాత్రి నాట్య గురువు జాహ్నవి ఆధ్వర్యంలో స్థానిక కూచిపూడి కళాధామం చిన్నారులు ప్రదర్శించిన నృత్యాలు అందర్నీ అలరించాయి.ఈ సందర్భంగా చిన్నారులు మూషిక వాహన, ఆలోకమే శ్రీ, శివాష్టకం, తరంగం, అఖిలాండేశ్వరి, నారాయనాయ, అన్నమయ్య పదాలు, బ్రహ్మ మొక్కటే, గణేష్ పంచరత్నం, భామనే సత్యభామనే వంటి అంశాలకు నృత్యాలు చేసి ఆకట్టుకున్నారు.ఉత్సవ కమిటీ అధ్యక్షుడు పల్లి శ్రీనివాసరెడ్డి నాట్యగురువు జాహ్నవిని సత్కరించి, చిన్నారులకు ప్రశంసాపత్రాలు అందజేశారు. ఉత్సవ కమిటీ సభ్యులు పాలచర్ల శివప్రసాద్‌చౌదరి, చాగంటి సాయిబాబారెడ్డి, పల్లి రాజారెడ్డి, నందిపాటి కిషోర్ పాల్గొన్నారు. ఇదిలా ఉండగా శ్రీకుమారసుబ్రహ్మణ్యస్వామిని మాజీ ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి దంపతులు దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. వీరి వెంట ఏఎంసీ మాజీ ఛైర్మన్ జేవీవీ సుబ్బారెడ్డి, వైసీపీ నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

మహిళలపై డిజిటల్ రివ్యూల దాడులపై అవగాహన

రాజమహేంద్రవరం కల్చరల్, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): స్థానిక కందుకూరి రాజ్యలక్ష్మి ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ పి.రాఘవకుమారి పర్యవేక్షణలో శుక్రవారం కళాశాల ఇన్‌క్లూజివ్ సెంటర్, ఈగల్ క్లబ్ సంయుక్త ఆధ్వర్యంలో మహిళలపై డిజిటల్ రివ్యూల దాడులు అనే అంశంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన శ్రీనంద హాస్పిటల్ గైనకాలజిస్ట్ డాక్టర్ కె.ఫణికుమారి మాట్లాడుతూ ప్రపంచంలో మహిళలు ఎదుర్కొంటున్న వివిధ రకాల ఆన్‌లైన్ దాడులు, మోసాలు, వేధింపులు, సైబర్ స్టాకింగ్, డిజిటల్ రివ్యూల ద్వారా మహిళల ప్రతిష్ఠను దెబ్బతీసే ప్రయత్నాలు వంటి అంశాలను వివరించారు. వాటిని ఎలా ఎదుర్కోవాలో, చట్టపరంగా మహిళలకు ఏఏ హక్కులున్నాయో వివరించి, సూచనలు అందించారు. కార్యక్రమంలో డాక్టర్ నీరజ, అధ్యాపకులు, విద్యార్థినులు పాల్గొన్నారు.


ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించాలి

రాజమహేంద్రవరం రూరల్, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): పిల్లల్లో ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించేందుకు తల్లిదండ్రులు కృషి చేయాలని ప్రముఖ సినీగేయరచయిత,కవి భాస్కరభట్ల రవికుమార్ తెలిపారు. శ్రీషిర్డిసాయి విద్యాసంస్థల ఆధ్వర్యంలో 'కేరింతలు' పేరిట జరిగిన కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా విచ్చేసి మాట్లాడారు. పిల్లలకు విద్యతో పాటు ఏఏ రంగాల్లో ఆసక్తి ఉందో తెలుసుకుని వారి అభిరుచులకు అనుగుణంగా వారిని ప్రోత్సహించాలన్నారు. మరో అతిథి 9వ అదనపు జిల్లా సివిల్ జడ్జి మాధురి మద్దాలి మాట్లాడుతూ ప్రతీ తల్లిదండ్రులు తమ పిల్లలు చెప్పిన విషయాలు వింటూ మంచి, చెడులను వారికి తెలియజేయాలన్నారు. చిన్నారుల సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. షిర్డిసాయి విద్యాసంస్థల వ్యవస్థాపకుడు తంబాబత్తుల పాలేశ్వరరావు సతీమణి నాగమణి జ్యోతిప్రజ్వలనతో ప్రారంభమైన ఈ కార్యక్రమంలో ఛైర్మన్ తంబాబత్తుల శ్రీధర్, డైరెక్టర్ శ్రీవిద్య, శ్రీలేఖ పాల్గొన్నారు.

యాజమాన్యం వైఖరి మారాలి

హెచ్‌పీసీఎల్ ఆయిల్ టెర్మినల్ వద్ద డ్రైవర్ల ఆందోళన

గోకవరం, నవంబరు28(ఆంధ్రజ్యోతి): మండలంలోని గుమ్మళ్లదొడ్డి హెచ్‌పీసీఎల్ ఆయిల్ టెర్మినల్ యాజమాన్యం వైఖరిని నిరసిస్తూ శుక్రవారం ట్యాంకర్ల డ్రైవర్లు, క్లీనర్లు ఆందోళనకు దిగారు. సంస్థకు చెందిన అసిస్టెంట్ మేనేజర్ తెలుగు డ్రైవర్లు, క్లీనర్ల పట్ల చులకన భావంతో ప్రవర్తిస్తున్నారని, లోడింగ్ సమయాలు మార్చాలని, అసిస్టెంట్ మేనేజర్‌ను తొలగించాలని, విధుల నుంచి తొలగించిన డ్రైవర్ అడబాల రామదుర్గాన్ని వెంటనే విధుల్లోకి తీసుకోవాలని, యాజమాన్యం తమతో మర్యాద పూర్వకంగా నడుచుకోవాలని డిమాండు చేసారు. ఆందోళనకారులు అధికసంఖ్యలో గుమికూడి నిరసనకు దిగడంతో ఆప్రాంతంలో సుమారు రెండు గంటలపాటు ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం ఏర్పడింది.



పదీ విద్యార్థులను నూరుదాం!

» 100 రోజుల పాఠ్య ప్రణాళిక కచ్చితం
» 5న మెగా టీచర్స్-పేరెంట్స్ మీట్ : కలెక్టర్

రాజమహేంద్రవరం, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి) : పదో తరగతి పబ్లిక్ పరీక్షల్లో అత్యుత్తమ ఫలితాలు సాధించడానికి ప్రభుత్వం రూపొందించిన 100 రోజుల కార్యాచరణ ప్రణాళికను పకడ్బందీగా అమలు చేయాలని కలెక్టర్ కీర్తి చేకూరి ఆదేశించారు. జిల్లా విద్యా శాఖ పని తీరుపై శుక్రవారం ఆమె సమీక్షించారు. తరగతుల వారీగా విద్యార్థుల అభ్యసన స్థాయిలను ఉపాధ్యాయులు విశ్లేషించాలన్నారు. ఏ,బీ గ్రేడుల్లోని వాళ్ల మెరుగుపడే విధంగా ప్రోత్సహించాలని.. సీ,డీ గ్రేడ్‌ల వాళ్లపై ప్రత్యేక దృష్టి సారించాలని చెప్పారు. ప్రతి విద్యార్థికి ఏపీఏఆర్ ఐడీ కార్డు తప్పనిసరిగా ఉండాలన్నారు. ఆధార్ ఆధారిత విద్యార్థి వివరాల అప్‌డేట్‌ని వేగవంతం చేయాలని ఆదేశించారు. జిల్లాలోని 1,684 పాఠశాలల్లోని 3,13,958 మంది విద్యార్థుల్లో ఇప్పటి వరకూ 2,86,311 మందికి అప్‌డేట్ పూర్తయిందన్నారు. అందరి వివరాలను అప్‌డేట్ చేయడానికి గ్రామ/వార్డు సచివాలయాల వెల్ఫేర్, డిజిటల్ అసిస్టెంట్లు తదితర సిబ్బందిని సమన్వయంతో వినియోగించాలని సూచించారు. డిసెంబరు 5న ప్రతి పాఠశాల పరిధిలో మెగా పేరెంట్స్ టీచర్స్ మీట్(పీటీఎం) 3.0ని నిర్వహించాలని ఆదేశించారు. పాఠశాల పురోగతికి తల్లిదండ్రుల భాగస్వామ్యం కీలకమన్నారు.తల్లిదండ్రులు తమ పిల్లలతో కలిసి తరగతుల్లో కూర్చునే విధంగా సీటింగ్ ఏర్పాటు చేయా లని సూచించారు. కార్యక్రమంలో డీఈవో వాసుదేవరావు, ఎస్ఎస్ఏ పీడీ సుభాషిణి, డిప్యూటీ డీఈవో దిలీప్ కుమార్ పాల్గొన్నారు.

పోలవరం ప్రాజెక్టు అనుబంధ పనులకు రూ. 542 కోట్లు

రాజమహేంద్రవరం, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి) : పోలవరం ప్రాజెక్టుకు ఇరువైపులా రోడ్ల నిర్మాణానికి రూ. 542.85 కోట్లు కేటాయించారు. రాజధానిలో శుక్రవారం సీఎం చంద్రబాబు నాయుడు అధ్యక్షన జరిగిన కేబినెట్ సమావేశం ఆమోదం తెలిపింది. ఇరిగేషన్ శాఖ ద్వారా కేటాయించిన ఈ నిధులతో పోలవరం గ్రామం నుంచి స్పిల్‌వే వరకూ అనుసంధాన రహదారులు నిర్మిస్తారు. తూర్పుగోదావరి జిల్లా వైపు ప్రాజెక్టు నుంచి ఎడమ ప్రధాన కాలువ (ఎల్ఎంసీ) వద్దకు గ్యాప్-1ను కలుపుతూ రోడ్ల నిర్మాణం చేస్తారు. వీటికి రూ.217.55 కోట్లు కేటాయించారు. గండిపోచమ్మ గుడి, హెడ్ రెగ్యులేటర్, నావిగేషన్ టన్నెల్ చివర కెఎల్ బండ్‌కు కలిపే పనులు చేస్తారు. అంగుళూరు, పురుషోత్తపట్నం, రామచంద్రపురం గండిపోచమ్మగుడి వరకూ ఏజీ ఎల్‌బీ రక్షణ పనులు చేస్తారు.వరద నష్ట నివారణ చర్యల్లో భాగంగా పనులన్నింటినీ ప్రభుత్వం ఆమోదించింది.

ఉగాది నాటికి టిడ్కో ఇళ్లు..

మునిసిపల్ కార్పొరేషన్లు, మునిసిపాలిటీల పరిధిలో ఇళ్లను నిర్మించుకునే సమయంలో ఖాళీ స్థలాల పన్నులు 50 శాతం తగ్గించడానికి కేబినెట్ నిర్ణయం తీసుకుంది. ఉగాది నాటికి టిడ్కో ఇళ్లను కూడా అప్పగించాలని నిర్ణయించింది.

పీఎంఏవై 2.0 సర్వేలో 16,335 మంది గుర్తింపు

రాజమహేంద్రవరం, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి) : ప్రధానమంత్రి ఆవాస్ యోజన- గ్రామీణ 2.0 కింద ఇళ్లులేని పేదల గుర్తింపునకు చేసిన సర్వే ఇప్పటికే 100 శాతం పూర్తయిందని జిల్లా కలెక్టర్ కీర్తి చేకూరి శుక్రవారం తెలిపారు.ఈ మేరకు శుక్రవారం రాత్రి ఒక ప్రకటన విడుదల చేశారు. జిల్లాలో 16,335 మందిని అర్హులుగా గుర్తించామన్నారు. ఈ నెల 30వ తేదీ వరకూ ఎవరైనా అర్హులుంటే హౌసింగ్ ఏఈ, సచివాలయ ఇంజనీరింగ్ అసిస్టెంట్ల ద్వారా నమోదు చేసుకోవాలన్నారు. పక్కా ఇల్లు లేనివారు, గతంలో ఏ గృహ పథకంలోనూ లబ్ధిపొందని వారు మాత్రమే అర్హులన్నారు.

భార్య చీరతో.. భర్త ఉరి

రాజమహేంద్రవరం, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): భార్య పుట్టింటికి వెళ్లిపోవడంతో మనస్తాపంతో భర్త ఆమె చీరతోనే ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. నగరంలోని వీఅండ్‌టీ కాలనీలో కుటుంబంతో నివాసం ఉంటున్న దొడ్డిపట్ల విజయ శేఖర్(42) పేపర్ మిల్లులోని ప్రైవేటు ఉద్యోగిగా పని చేస్తున్నాడు.శేఖర్‌కి ఎనిమిదేళ్ల కిందట వివాహం కాగా ఇద్దరు పిల్లలున్నారు. భర్త మద్యానికి బానిసై కుటుంబాన్ని నిర్లక్ష్యం చేయడంతో విసిగిపోయిన భార్య రెండు నెలల కిందట పిల్లలను తీసుకొని పుట్టింటికి వెళ్లిపోయింది.దీంతో తీవ్రంగా మనస్తాపం చెందిన శేఖర్ గురువారం రాత్రి బాగా తాగొచ్చి భార్య చీరతో ఉరేసుకున్నాడని పోలీసులు భావిస్తున్నారు. శుక్రవారం ఉదయం మృతుడి తండ్రి వెంకయ్య గమనించి పోలీసులకు సమాచారం ఇచ్చాడు.ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని త్రీటౌన్ సీఐ అప్పారావు తెలిపారు.



టిడ్కో డబ్బులిస్తారా!

పేదింట తీరని కలత

లక్ష కట్టండి.. సొంతింట్లో దిగండి.. ఇదీ గత టీడీపీ ప్రభుత్వంలో టిడ్కో లబ్ధిదారులకు ఇచ్చిన భరోసా.. చాలా మంది పేదలు అప్పులు చేసి మరి రూ.లక్ష చొప్పున కట్టారు. అయితే 2019లో టీడీపీ ఓటమిపాలవడంతో టిడ్కో ఇళ్లు ఎక్కడిక్కడే నిలిచిపోయాయి. అనంతరం వైసీపీ అధికారంలోకి రావడంతో పలువురి ఇళ్లను రద్దు చేసేసింది. అయితే ముందు చెల్లించాల్సిన రూ.లక్ష మాత్రం ఏ ఒక్కరికీ చెల్లించలేదు. దీంతో లబ్ధిదారులు ఐదేళ్లుగా సొమ్ము వెనక్కు రాక ఈసురోమంటున్నారు. అప్పులు చేసి కట్టిన డబ్బులు ఇవ్వకుండా ఎన్నాళ్లు ఏడిపిస్తారంటూ కలెక్టరేట్ల చుట్టూ కాళ్లరిగేలా తిరుగుతున్నారు. గత వైసీపీ ప్రభుత్వ నిర్వాకంతో తమకు ఇన్ని ఇబ్బందులు ఎదురవుతున్నాయని.. ప్రస్తుత ప్రభుత్వమైనా కరుణించాలంటూ గ్రీవెన్స్ సెల్‌లో దరఖాస్తులు చేస్తున్నారు. అయినా డబ్బుల సంగతి తేలకపోవడంతో అయోమయంలో ఉన్నారు.

- (కాకినాడ,ఆంధ్రజ్యోతి)

» వైసీపీలో టిడ్కో నిధులు మళ్లింపు
» ఇళ్లు రద్దు చేసినా చెల్లింపుల్లేవ్
» ఐదేళ్లుగా లబ్ధిదారుల ఎదురుచూపులు
» అయోమయంలో రూ.10.52 కోట్లు
» ఎంపీ, ఎమ్మెల్యేలకు విన్నపాలు
» అయినా ఫలించని వైనం

ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా టిడ్కో ఇళ్లు రద్దయిన వారి డబ్బులు రూ.10.20 కోట్ల మేర పేరుకుపోయాయి. ఆ రిఫండ్ డబ్బులు వస్తాయో రావో అన్నట్టుగా పరిస్థితి మారింది. నిధుల విడుదలకు ఆయా మునిసిపాలిటీల వారీగా ఎమ్మెల్యేలు సైతం ప్రయత్నం చేస్తున్నా అమరావతిలో టిడ్కో ఉన్న తాధికారులు మాత్రం ఉలుకు పలుకు లేకుండా ఉన్నారు. కాకినాడ కార్పొరేషన్ పరిధిలో రూ.6.53 కోట్లు, రామచంద్ర పురం రూ.1.20 కోట్లు, పెద్దాపురం రూ.59.28 లక్షలు, మండపేట రూ.42 లక్షలు, కొవ్వూరు, నిడదవోలు మునిసిపాలిటీల్లో 21 లక్షల చొప్పున రిఫండ్ డబ్బులు పేరుకుపోయాయి.

టీడీపీ ఇస్తే..వైసీపీ వచ్చి లాగేసుకుంది..

2014లో అధికారంలోకి వచ్చిన అప్పటి టీడీపీ ప్రభుత్వం పట్టణాలు, నగరాల్లో నివసించే పేదల కోసం టిడ్కో ఇళ్లు నిర్మించాలని నిర్ణయించింది. ఈ మేరకు 2017-2019 మధ్య లబ్ధిదారులను ఎంపిక చేసింది. టిడ్కో ఇళ్ల కోసం ఆయా మునిసిపాలిటీలకు లబ్ధిదారుడి వాటాగా రూ.లక్ష, రూ.50 వేలు, రూ.25వేల చొప్పున చెల్లించారు. 2019లో వైసీపీ ప్రభుత్వం రాగానే టీడీపీ ప్రభుత్వం నిర్మించిన టిడ్కో ఇళ్లపై కత్తి కట్టింది. పేదలకు ఇవ్వకుండా నిలిపివేసింది. వేలాది మందికి మంజూరైన టిడ్కో ఇళ్లను రద్దు చేసేసింది. ఈ మేరకు లబ్ధిదారులకు అంతకు ముందు వారు చెల్లించిన మొత్తాన్ని వెనక్కు ఇవ్వాల్సి ఉంది. కానీ అప్పటి వైసీపీ ప్రభుత్వం ఆ డబ్బులను అప్పటికే మునిసిపాలిటీల నుంచి టిడ్కోలో ప్రత్యేక ఖాతాకు మళ్లించేసి వాడేసుకుంది. దీంతో లబ్ధిదారులు ఎంత మొత్తు కున్నా వారి డబ్బులను వెనక్కివ్వలేదు. చివరకు ఇప్పటికి ఐదేళ్లవుతున్నా ఏ ఒక్కరికీ డబ్బులు రిఫండ్ రాక వారంతా లబోదిబోమంటున్నారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా రూ.10.20 కోట్ల వరకు పేరుకుపోయాయి.

ఎక్కడెక్కడ ఎంత ఇవ్వాలంటే..

కాకినాడ కార్పొరేషన్ పరిధిలో రూ.6.53 కోట్లు రిఫండ్ డబ్బులు వెనక్కు రాక లబ్ధిదారులు నెత్తీ నోరు బాదుకుంటున్నారు. రూ.లక్ష చొప్పున 589 మందికి, రూ.25 వేల చొప్పున 150 మందికి, రూ.50 వేల చొప్పున 448 మందికి డబ్బులు రాలేదు. అప్పట్లో కార్పొరేషన్ పరిధిలో 2,056 టిడ్కో ఇళ్లు నిర్మించారు. సైట్-ఏలో 1,152 ఇళ్లు, సైట్-బీలో 904 ఇళ్లు నిర్మించారు. వీటికి సంబంధించి ఇళ్లు మంజూరై ఆనక రద్దయిన, రద్దు చేసుకున్న లబ్ధిదారులకు రూ.6.53 కోట్లు వెనక్కు రాలేదు. సామర్లకోట మునిసిపాలిటీ పరిధిలో 1,056 ఇళ్లు నిర్మించగా వీటిలో రద్దు చేసుకున్న వారికి రూ.25 లక్షలు వెనక్కు రావాల్సి ఉంది. ఇందులో రూ.లక్ష చొప్పున 33 మందికి రావాల్సి ఉంది. పెద్దాపురం మునిసిపాలిటీలో 3,312 ఇళ్లు నిర్మించగా రద్దు చేసుకున్న వారికి రూ.59.28 లక్షలు ఐదేళ్ల నుంచీ వెనక్కు రావడం లేదు. వీరిలో రూ.లక్ష చొప్పున చెల్లించిన వారు 55 మంది, రూ.50 వేల చొప్పున చెల్లించిన వారు 106 మంది ఉన్నారు. పిఠాపురంలో 864 టిడ్కో ఇళ్లు నిర్మించగా రూ.10 లక్షలు ఇంకా వెనక్కు రాలేదు. రామచంద్రపురం మునిసిపాలిటీలో లబ్ధిదారులకు రూ.1.20 కోట్లు రావాల్సి ఉంది. వీరిలో రూ.లక్ష చొప్పున చెల్లించిన వారు 92 మంది ఉన్నారు. మండపేట మునిసిపాలిటీలో రూ.42 లక్షలు, అమలాపురం మునిసిపాలిటీ రూ.40 లక్షలు రావాల్సి ఉంది. తూర్పుగోదావరి జిల్లా నిడదవోలు, కొవ్వూరు మునిసిపాలిటీల పరిధిలో రూ.21 లక్షల వరకు రావాల్సి ఉంది.

వస్తాయా..రావా..

లబ్ధిదారులకు వెనక్కు ఇవ్వాల్సిన డబ్బులను అప్పటి వైసీపీ ప్రభుత్వం అడ్డగోలుగా వాడేసుకుంది. దీంతో రిఫండ్ డబ్బులు ఎవరికీ రాలేదు. ప్రభుత్వం మారిన తర్వాత అనేక మంది బాధితులు ప్రతి సోమవారం పీజీఆర్ఎస్‌కు వచ్చి కలెక్టర్లకు వినతి పత్రాలు ఇస్తున్నారు. తమ డబ్బులు తమకు ఇప్పించాలని కాళ్లరిగేలా తిరుగుతున్నారు. ఎమ్మెల్యేలు, ఎంపీల వద్దకు సైతం లబ్ధిదారులు తిరుగుతున్నా పనవడం లేదు. ఈ నిధులు లబ్ధిదారులకు వెనక్కివ్వాలని కలెక్టర్లు,ఎమ్మెల్యేలు సైతం టిడ్కోకు లేఖలు రాసినా ఎలాంటి ప్రయోజనం లేదు. తమ వద్ద ఆ నిధులు లేవని అక్కడి అధికారులు సమాధానం చెబుతున్నారు. దీంతో రిఫండ్ డబ్బులపై అయోమయం నెలకొంది.ఇటీవల కాకినాడకు వచ్చిన జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి నారాయణ దృష్టికి అధికారులు ఈ విషయాన్ని తీసుకెళ్లారు. అయితే ప్రభుత్వం దృష్టికి మరోసారి తీసుకువెళ్తానని పేర్కొన్నారు.

పల్లె దారులకు పండగ!



మొదలైన పాలచర్ల నుంచి గాడాల వెళ్లే రోడ్డు పనులు

» పల్లెపండుగ 2.0 సందడి
» రూ.54 కోట్లతో రూ.267 సీసీ రోడ్లు
» వచ్చే ఏడాది మార్చి 31నాటికి పూర్తి
» గ్రామాల్లో పనులు ఆరంభం

(రాజమహేంద్రవరం- ఆంధ్రజ్యోతి)

పల్లెపండుగ 2.0 సందడి మొదలైంది. పల్లెల్లో ప్రతీ వీధిలోనూ రోడ్లు నిర్మించాలనే లక్ష్యంతో గతేడాది అక్టోబరులో మొదటి విడత పనులు జరిగిన సంగతి తెలిసిందే. గత వైసీపీ ప్రభుత్వం రోడ్లను నిర్లక్ష్యం చేయడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. తెలుగుదేశం కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత సీఎం చంద్రబాబు నాయకత్వంలో రోడ్ల నిర్మాణ పనుల్లో కదలిక వచ్చింది. పల్లె పండుగ పేరుతో ఉపాధి హామీ పథకం నిధులతో పనులు చేస్తున్నారు. రెండో విడత పల్లె పండుగ పనులను డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ ఈ నెల 26న కోనసీమలో ప్రారంభించారు. ఈ ఏడాది రూ.54 కోట్లతో 267 పనులు చేయనున్నారు.ఈ మేరకు పనులు ఆరంభమయ్యాయి. మార్చి నెలాఖరుకి పనులు పూర్తి చేయనున్నారు. వాస్తవానికి ప్రభుత్వం రూ.152 కోట్ల విలువైన పనులను మంజూరు చేసింది. కానీ ఉపాధి హామీ నిధులు తక్కువగా ఉండడంతో ప్రస్తుతం రూ.54 కోట్లతో 76 కిలోమీటర్ల మేర పనులు చేస్తున్నారు.ఇవన్నీ సీసీ రోడ్లే. కనీసం మూడు మీటర్ల నుంచి అంటే 10 అడుగుల నుంచి 12 అడుగుల రోడ్ల వరకూ సీసీ రోడ్ల నిర్మాణం సాగుతోంది. కొన్ని ప్రాంతాల్లో ప్రాధాన్యతను బట్టి 17 నుంచి 18 అడుగుల వెడల్పు రోడ్లు నిర్మించనున్నారు.కనీసం రోడ్డు నిర్మాణ అంచనా రూ.10 లక్షల నుంచి ఆరంభమవుతుంది. ఒక్కో నియోజకవర్గంలోనూ 9 కోట్ల విలువైన 45 నుంచి 50 పనులు పనులు జరగనున్నాయి. గ్రామ పంచాయతీ తీర్మానంతో మండల పరిషత్ కార్యాల యంలో రిజిస్టర్ చేసుకున్న కాంట్రాక్టర్లు ఈ పనులు చేయనున్నారు. పంచాయతీ తీర్మానం తప్పనిసరి అవుతుంది.ఇప్పటికే జిల్లావ్యాప్తంగా అన్ని ప్రాంతాల్లోనూ కొన్ని పనులు ఆరంభించారు. గాడాల నుంచి పాలచర్ల రోడ్డు 1600 మీటర్ల పొడవున రూ.కోటి 4 లక్షలతో నిర్మాణ పనులు చేస్తున్నారు. ఇవన్నీ మార్చి నెలాఖరుకి పూర్తవుతాయని అధికారులు చెబుతున్నారు. గతేడాది రూ.67 కోట్లతో 149 పనులు చేసిన సంగతి తెలిసిందే. వీటికి సంబంధించిన బిల్లులు ఇటీవలే క్లియర్ చేశారు. సుమారు రూ.4 కోట్ల నుంచి రూ. 5 కోట్ల వరకూ బిల్లులు పెండింగ్ ఉన్నట్టు చెబుతున్నారు.మిగతా బిల్లులన్నీ క్లియర్ కావడంతో పనులు చేయడా నికి కాంట్రాక్టర్లు ముందుకు వస్తుండడం గమనార్హం. ఇటీవల మొంథా తుఫాన్ వల్ల కూడా అనేక రోడ్లు దెబ్బతిన్న సంగతి తెలిసిందే. పంచాయతీ రాజ్‌కు సంబంధించిన 70 రోడ్లు 137 కిలోమీటర్ల పొడవున దెబ్బతిన్నాయి. వీటి నిర్మాణానికి రూ.86 కోట్ల 27 లక్షలు అవసరం అవుతాయని అంచనా వేశారు.


మాట్లాడుతున్న జిల్లా వ్యవసాయాధికారి మాధవరావు

వ్యవసాయం మార్చండి

జిల్లా వ్యవసాయాధికారి మాధవరావు

రాజమహేంద్రవరం రూరల్, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి) : రైతుల వ్యవసాయంలో నూతన సాంకేతిక పరిజ్ఞానం ఉపయోగించి నాణ్యమైన, అధిక దిగుబడులు సాధించాలని జిల్లా వ్యవసాయాధికారి మాధవరావు అన్నారు. రూరల్ మండలం కొంతమూరులో నిర్వహించిన రైతన్న మీ కోసం కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. నీటి భద్రత, డిమాండ్ ఆధారిత పంటలు, వ్యవసాయ సాంకేతికత, ఫుడ్ ప్రోసెసింగ్ వంటి విషయాలపై అవగాహన కల్పించారు. నూతన వరి రకాలైన ఎంటియూ 1426, ఎన్ఎల్ఆర్ 3648 రకాలను వేసుకోవాలని శ్రీనివాస్ తెలిపారు. గోరంట్ల రవి రామ్ కిరణ్ మాట్లాడుతూ ప్రభుత్వ సంక్షేమ పథకాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు.ఈ కార్యక్రమంలో ఏరువాక కేంద్రం కోఆర్డినేటర్ చల్లా వెంకటనరసింహారావు, ఏడీఏ సూర్యరమేష్ ,వ్యవసాయ శాఖ అధికారులు పాల్గొన్నారు.


ఎంపీ పురందేశ్వరికి వినతిపత్రం అందజేస్తున్న టీచర్లు

టీచర్లను టెట్ నుంచి మినహాయించాలి

ఎంపీ పురందేశ్వరికి ఉపాధ్యాయుల వినతి

రాజమహేంద్రవరం అర్బన్, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి) : సీనియర్ ఉపాధ్యాయులను టెట్ పరీక్ష నుంచి మినహాయించాలని యూటీఎఫ్ సంఘం నేతలు రాజమండ్రి ఎంపీ దగ్గుబాటి పురందేశ్వరిని కోరారు.ఈ మేరకు శుక్రవారం యూటీఎఫ్ జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు పి.జయకర్, ఏ.షరీఫ్ ఆధ్వర్యంలో రాజమహేంద్రవరంలోని పలుకు కేంద్రం వద్ద ఎంపీని కలిసి వినతిపత్రం అందజేశారు. విద్యాహక్కు చట్టం ప్రకారం ఉపాధ్యాయులంతా విధిగా టెట్ పాస్ అవ్వాలని ఇటీవల సుప్రీం కోర్టు తీర్పునిచ్చిందని తెలిపారు. 20, 30 సంవత్సరాలు పైబడి సర్వీస్ చేసిన ఉపాధ్యాయులు ఇప్పుడు మళ్లీ టెట్ రాయాలనే నిబంధన ఇబ్బందికరంగా ఉందని, సవరించడానికి తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. దీనిపై ఎంపీ పురందేశ్వరి స్పందిస్తూ ఈ విషయంపై చర్చించి పార్టీ నిర్ణయం మేరకు తగిన చర్య తీసుకుంటామన్నారు.ఈ కార్యక్రమంలో యూటీఎఫ్ కోశాధికారి ఈవీఎస్ఆర్.ప్రసాద్, జిల్లా కార్యదర్శి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

బాలికల హాస్టళ్లకు ఉమెన్ వాచ్‌మెన్లు


బొమ్మూరు గిరిజన పాఠశాలలో విద్యార్థినులతో కలిసి నేలపై కూర్చుని మధ్యాహ్న భోజనం చేస్తున్న భార్గవి

» భద్రత పెంపునకు చర్యలు
» రాష్ట్ర గిరిజన సంక్షేమశాఖ డైరెక్టర్ భార్గవి

రాజమహేంద్రవరం అర్బన్/రాజమహేంద్రవరం రూరల్ , నవంబరు 28 (ఆంధ్రజ్యోతి) : హాస్టళ్లలో బాలికల భద్రతకు ఉమెన్ వాచ్‌మెన్లను నియమించనున్నామని రాష్ట్ర గిరిజన సంక్షేమ శాఖ డైరెక్టర్ ఎస్.భార్గవి అన్నారు. రాజమహేంద్రవరంలో నిర్వహించిన ఇంటిగ్రేటెడ్ గవర్నెన్స్ ద్వారా వాతావరణ స్థితిస్థాపక గిరిజన సంఘాలు' వర్క్‌షాపులో శుక్రవారం ఆమె పాల్గొన్నారు. అనంతరం బొమ్మూరులోని గిరిజన సంక్షేమ వసతిగృహాలను పరిశీలించారు. అక్కడి మౌలిక సౌకర్యాలు, శానిటేషన్, తాగునీరు, వసతి తదితర విషయాలను ఆరా తీశారు. డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజనంలో విద్యార్థులతో కలసి భోజనం చేశారు. ఆహార నాణ్యత, వంటశాల నిర్వహణ, పౌష్టికాహారంపై విద్యార్థుల అభిప్రాయాలు తెలుసుకున్నారు. భార్గవి మాట్లాడుతూ హాస్టల్ పిల్లల పట్ల బాధ్యత, మమకారం ఉండాలని సూచించారు. మన ఇంటి విషయంలో ఎంత పరిశుభ్రత పాటిస్తామో విద్యార్థుల వసతిగృహాల్లో అంతకంటే ఎక్కువ శ్రద్ధ తీసుకోవాలన్నారు. పరిశుభ్రతపై క్రమం తప్పకుండా పర్యవేక్షణ జరగాలన్నారు. ఉపాధ్యాయులు బోధన వృత్తి ధర్మమే అయినా విద్యార్థులతో మమేకమవుతూ వారి ఆలోచనలు,అవసరాలు తెలుసుకోవడం కూడా అంతే ముఖ్యమన్నారు. వసతి గృహాల ఆవరణలో పారిశుధ్యం సక్రమంగా లేకపోవడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. పంచాయతీ అధికారులను పిలిపించి తక్షణ చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకంలో విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. అహార నాణ్యత, వంటశాల నిర్వహణ, పౌష్టికాహారంపై విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. బాలికల భద్రతకు వసతి గృహాల్లో మహిళా వాచ్‌మెన్లను నియమిస్తామని తెలిపారు. ప్రతిరోజూ పాఠశాల తరగతులు పూర్తయిన తరువాత 5-10 నిమిషాలు పిల్లలతో మాట్లాడి వారి సమస్యలను తెలుసుకోవాలని హెచ్ఎం, వార్డెన్లకు సూచించారు. సంచాలకులతో పాటు జిరిజన పాఠశాల గిరిజన సంక్షేమ అధికారి జ్యోతి, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

స్పెషల్ గ్రేడ్ మునిసిపాలిటీగా నిడదవోలు

జీవో విడుదల చేసిన ప్రభుత్వం

నిడదవోలు, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి) : నిడదవోలు పురపాలక సంఘం మరో కీలక మైలురాయి దాటింది. ఇప్పటి వరకు సెకండ్ గ్రేడ్ మునిసిపాలిటీగా ఉన్న నిడదవోలు పురపాలక సంఘాన్ని కూటమి ప్రభుత్వం స్పెషల్ గ్రేడ్ మునిసిపాలిటీగా అప్‌గ్రేడ్ చేస్తూ జీవో జారీ చేసింది. నిడదవోలు పట్టణ వజ్రోత్సవ వేడుకల్లో రాష్ట్ర మంత్రి కందుల దుర్గేష్, ఎంపీ దగ్గుబాటి పురందేశ్వరి జీవో కాపీని ఆవిష్కరించారు.రెండు రోజుల కిందట ఇదే వజ్రోత్సవ వేడుకల్లో పాల్గొన్న పుర పాలకశాఖ మంత్రి పి.నారాయణ ఇచ్చిన హామీ మేరకు నిడదవోలు పురపాలక సంఘానికి స్పెషల్ గ్రేడ్ మునిసిపాలిటీగా జీవో జారీ చేశారు.


నిడదవోలు మునిసిపాలిటీకి స్పెషల్ గ్రేడ్ హోదా జీవో కాపీ చూపుతున్న ఎంపీ పురందేశ్వరి, మంత్రి దుర్గేష్

ప్రమాద రహిత డ్రైవింగ్‌పై ఆర్టీసీ డ్రైవర్లకు శిక్షణ

రాజమహేంద్రవరం అర్బన్, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి) : రాజమహేంద్రవరంలోని ఆర్టీసీ జోనల్ ట్రైనింగ్ కాలేజీలో హైర్ బస్ డ్రైవర్లు, ఆన్ కాల్ డ్రైవర్లకు శుక్రవారం ప్రమాదరహిత డ్రైవింగ్ శిక్షణ తరగతులు ప్రారంభించారు. జిల్లా ప్రజారవాణా అధికారి వైఎస్ఎన్ మూర్తి మాట్లాడుతూ డిసెంబరు 31వ తేదీ వరకూ శిక్షణ తరగతులు జరుగుతాయన్నారు. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా, పశ్చిమగోదావరి జిల్లా, ఏలూరు జిల్లాల్లోని 16 డిపోల నుంచి మొత్తం 1014 మంది డ్రైవర్లకు శిక్షణ ఇస్తారన్నారు.తొలిరోజున మొత్తం 63 మంది డ్రైవర్లకు శిక్షణ ఇచ్చారు.

విలీనంపై 30 రోజుల్లో అభ్యంతరాలు స్వీకరణ

రాజమహేంద్రవరం, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి) : తూర్పుగోదావరి జిల్లాలో మండపేట నియోజకవర్గం విలీనంపై ఏమైనా అభ్యంతరాలుంటే 30 రోజుల్లో తెలియజేయాలని కలెక్టర్ కీర్తి చేకూరి శుక్రవారం సూచించారు. ఆంధ్రప్రదేశ్ రెవెన్యూ శాఖ వెలువరించిన ప్రాథమిక నోటిఫికేషన్ ప్రకారం కోనసీమ జిల్లా రామచంద్రపురం డివిజన్ పరిధిలోని మండపేట, రాయవరం, కపిలేశ్వరపురం మండలాలు తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరం రెవెన్యూ డివిజన్ పరిధిలోకి బదిలీ ప్రతిపాదన ఉందన్నారు. దీనిపై 30 రోజుల్లోపు అభ్యంతరాలు , సూచనలు ఉంటే తెలియజేయాలని జిల్లా కలెక్టర్ కీర్తి చేకూరి సూచించారు.

నిడదవోలులో వజ్రోత్సవ వేడుకల ర్యాలీ

నిడదవోలు, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): నిడదవోలు పురపాలక సంఘ వజ్రోత్సవ వేడుకలను అన్నివర్గాల నుంచి విశేష స్పందన లభిస్తోందని మున్సిపల్ చైర్మన్ భూపతి ఆదినారాయణ అన్నారు. శుక్రవారం నిడదవోలు పట్టణంలోని గణేష్‌చౌక్ సెంటరు నుంచి వజ్రోత్సవ వేడుకల ర్యాలీ నిర్వహించారు. దీన్ని మున్సిపల్ చైర్మన్ ప్రారంభించి మాట్లాడుతూ అన్నివర్గాల ప్రజలు వజ్రోత్సవ వేడుకలలో భాగస్వామ్యం కావడం ఎంతో ఆనందదాయక మన్నారు. అనంతరం ర్యాలీ పంగిడి రోడ్డు మీదుగా సాగింది. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ టేట కృష్ణవేణి, వైస్ చైర్మన్ వజీరు ద్దీన్, కౌన్సిలర్లు గోపిరెడ్డి శ్రీనివాస్, జానీబాబు, కారింకి నాగేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.



ర్యాలీలో పాల్గొన్న మున్సిపల్ చైర్మన్ ఆదినారాయణ, తదితరులు

కొవ్వూరు చేరుకున్న లక్ష్మీరమణి పాదయాత్ర


దొమ్మేరు వద్ద స్వాగతం పలుకుతున్న టీడీపీ నాయకులు

కొవ్వూరు, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): ద్వారకాతిరుమల నుంచి సింహాచలం వరకు పాదయాత్రగా వస్తున్న ద్వారకాతిరుమల మాజీ జడ్పీటీసీ మొగతడల లక్ష్మీరమణికి టీడీపీ నాయకులు శుక్రవారం ఘన స్వాగతం పలికారు. ఉదయం దొమ్మేరులో లక్ష్మీరమణి మాట్లాడుతూ 2024లో చంద్రబాబు ప్రభుత్వం అధికారంలోకి వస్తే ద్వారకాతిరుమల నుంచి అన్నవరం, సింహాచలం పాదయాత్రగా వస్తానని మొక్కుకున్నానని చెప్పారు. కొవ్వూరు మాజీ మున్సిపల్ చైర్మన్ సూరపనేని చిన్ని, మాజీ జడ్పీటీసీ గారపాటి శ్రీదేవి, ఎంపీటీసీ యలమర్తి శ్రీరాంప్రసాద్, సొసైటీ అధ్యక్షులు గారపాటి రామకృష్ణ, పొట్రు మురళీ, బర్ల శ్రీనివాస్, నాయుడు వెంకటేశ్వరావు, బొండాడ సత్యనారాయణ ఘన స్వాగతం పలికినవారిలో ఉన్నారు.

సుబ్రహ్మణ్యేశ్వర స్వామికి ఎమ్మెల్యే మద్దిపాటి పూజలు


నల్లజర్లలో స్వామివారిని దర్శించుకున్న ఎమ్మెల్యే మద్దిపాటి వెంకట రాజు

నల్లజర్ల, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): నల్లజర్లలో వేంచేసి ఉన్న సుబ్రహ్మణ్యేశ్వర స్వామిని శుక్రవారం ఎమ్మెల్యే మద్దిపాటి వెంకటరాజు దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆయన ప్రత్యేక పూజలు చేశారు. పలు గ్రామాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామివారిని దర్శించుకున్నారు. భజన మండలి సభ్యులు సంకీర్తనలు చేశారు. కార్యక్రమంలో నల్లజర్ల సొసైటీ అధ్యక్షుడు రావూరి వెంకట రమణ, మాజీ సర్పంచ్ యలమటి శ్రీనివాసరావు, ఆల్లాడ రాజారావు, టీడీపీ గ్రామ అధ్యక్షుడు బేతిన దుర్గారావు, అప్పసాని జగన్నాథం, విడియాల శ్రీను, తదితరులు పాల్గొన్నారు.

బాల్య వివాహాల నిర్మూలనకు కృషి చేయాలి : ఎంపీడీవో

చాగల్లు, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): బాలికల ఉజ్వల భవిష్యత్ కోసం బాల్య వివాహ నిర్మూలనకు అందరూ బాధ్యతతో కృషి చేయాలని ఎంపీడీవో ఆర్. శ్రీదేవి అన్నారు. శుక్రవారం ఎంపీడీవో కార్యాలయంలో మహిళా శిశు సంక్షేమశాఖ ఆధ్వర్యంలో బాల్య వివాహ ముక్తి భారత్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ ప్రతి అంగన్‌వాడీ కార్యకర్త వారి అంగన్‌వాడీ పరిధిలో కిషోర బాలికలకు అవగాహన కల్పించాలన్నారు. అలాగే పాఠశాలల్లోనూ సమావేశాలు నిర్వహించాలన్నారు. సూపర్‌వైజర్ పి. పద్మావతి, జి. శిరీష పాల్గొన్నారు.


చాగల్లులో అవగాహన సదస్సు నిర్వహిస్తున్న దృశ్యం

స్వామి వారిని దర్శించుకున్న మాజీ ఎమ్మెల్యే సూర్యనారాయణరెడ్డి

బిక్కవోలు, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): బిక్కవోలు షష్ఠి ఉత్సవాల్లో భాగంగా శుక్రవారం శ్రీకుమార సుబ్రహ్మణ్యస్వామి వారిని మాజీ ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి దంపతులు దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. వీరి వెంట ఏఎంసీ మాజీ చైర్మన్ జేవీవీ సుబ్బారెడ్డి, వైసీపీ నేతలు కార్యకర్తలు, తదితరులు ఉన్నారు.

రైతు సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం

● ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు

కొవ్వూరు, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): రైతు సంక్షేమమే ధ్యేయంగా కూటమి ప్రభుత్వం పని చేస్తోందని ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు అన్నారు. కుమారదేవంలో శుక్రవారం రైతన్న మీకోసం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వం రాష్ట్రాన్ని అప్పుల ఊబిలో నెట్టేసినా... వాటిని అధిగమించి రైతన్నలకు ఇచ్చిన హామీ మేరకు చంద్రబాబు అన్నదాత సుఖీభవ మొదటి, రెండవ విడతలను రైతు ఖాతాల్లో జమ చేయడం జరిగిందన్నారు. అలాగే రైతులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా రైతు సేవా కేంద్రాల ద్వారా సకాలంలో గోనె సంచులను అందిస్తోందన్నారు. ధాన్యం విక్రయించిన 24 గంటల్లోనే సొమ్ము జమచేస్తున్నామన్నారు. కార్యక్రమంలో దిసనక్య కమిటీ సభ్యులు కంటమణి రామకృష్ణారావు, జొన్నలగడ్డ సుబ్బరాయచౌదరి, ఏఎంసీ చైర్మన్ నాదెళ్ల శ్రీరామ్, వట్టికూటి వెంకటేశ్వరరావు, గొడిశాల సురేష్, దావా శ్రీనివాస్, తుంపల్లి ఆదినారాయణ, వ్యవసాయాధికారులు, రైతులు, తదితరులు పాల్గొన్నారు.



కుమారదేవంలో రైతన్న మీకోసం కార్యక్రమంలో ఎమ్మెల్యే ముప్పిడి

ఎమ్మెల్యే గ్రీవెన్స్‌కు 12 ఫిర్యాదులు

నియోజకవర్గ ప్రజల సమస్యల పరిష్కారమే లక్ష్యంగా గ్రీవెన్స్ నిర్వహిస్తున్నట్టు ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు అన్నారు. శుక్రవారం కొవ్వూరు నియోజకవర్గ టీడీపీ కార్యాలయంలో నిర్వహించిన గ్రీవెన్స్‌లో ఎమ్మెల్యే పాల్గొని ప్రజల నుంచి 12 ఫిర్యాదులను స్వీకరించారు. అనంతరం నియోజకవర్గంలోని టీడీపీ నాయకులతో సమావేశాన్ని నిర్వహించారు. దిసనక్య కమిటీ సభ్యులు కంటమణి రామకృష్ణారావు, జొన్నలగడ్డ సుబ్బరాయచౌదరి, ఎం ఫణి కార్యనారాయణ, మద్దిపట్ల శివరామకృష్ణ, సూరపనేని చిన్ని, దాయన రామకృష్ణ, సూర్యదేవర రంజిత్, బేతిన నారాయణ పాల్గొన్నారు.

సీఎం సహాయనిధి చెక్కు పంపిణీ

కుమారదేవంకి చెందిన షేక్ సత్తార్ బీకి సీఎం సహాయనిధి నుంచి మంజూరైన రూ. 30,786 చెక్కును శుక్రవారం పంపిణీ చేశారు.

నిధులు మంజూరు చేయాలి

పట్టణంలోని యానాదికాలనీలో ఎస్టీ కమ్యూనిటీ హాలు నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని ఎంపీ పురందేశ్వరికి వినతిపత్రం అందజేశారు. శుక్రవారం రాజమహేంద్రవరంలో ఎంపీని కలిసి రూ.40 లక్షలు మంజూరు చేయాలనే ప్రతిపాదనతో కూడిన వినతిపత్రాన్ని అం దజేసినట్టు ఎమ్మెల్యే ముప్పిడి తెలిపారు.

పుష్కర పనులపై శాఖల వారీగా నివేదిక అందించాలి

గోదావరి పుష్కరాలకు సంబంధించి శాఖల వారీగా నివేదిక తయారుచేసి అందజేయాలని ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు అన్నారు. శనివారం జిల్లా కలెక్టర్ కార్యాలయంలో జరగనున్న గోదావరి పుష్కరాల సమీక్ష సమావేశాన్ని పురస్కరించుకుని నియోజకవర్గ టీడీపీ కార్యాలయంలో శుక్రవారం వివిధప్రభుత్వ శాఖల అధికారులతో సమావేశాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో దిసనక్య కమిటీ సభ్యుడు జొన్నలగడ్డ సుబ్బరాయచౌదరి, మద్దిపట్ల శివరామకృష్ణ, సూరపనేని చిన్ని, బేతిన నారాయణ, సూర్యదేవర రంజిత్, వివిధ ప్రభుత్వ అధికారులు పాల్గొన్నారు.

సంక్షేమానికి ఆద్యుడు స్వర్గీయ ఎన్టీఆర్

● ఎమ్మెల్యే మద్దిపాటి వెంకట్రాజు

గోపాలపురం, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో సంక్షేమానికి స్వర్గీయ అన్న ఎన్టీఆర్ ఆద్యుడని ఎమ్మెల్యే మద్దిపాటి వెంకట్రాజు అన్నారు. శుక్రవారం చెరుకుమిల్లిలో టీడీపీ అధ్యక్షుడు మండల పడమటి దుర్గారావు ఆధ్వర్యంలో ఎన్టీఆర్ విగ్రహాన్ని ఎమ్మెల్యే ప్రారంభించారు. అలాగే పెద్దాపురంలో రూ.30 లక్షలతో నిర్మించిన బీసీ కమిటీహాలును ఆయన ప్రారంభించి మాట్లాడుతూ ప్రభుత్వం చేపట్టే ప్రతి పనికీ ప్రజల్లో భాగస్వామ్యం తోడైనప్పుడే అభివృద్ధి శరవేగంతో పరుగులు పెడుతుందన్నారు. పెద్దాపురంలో ఎంపీ నిధులు రూ.20 లక్షలతో నిర్మించిన సామాజిక భవనానికి దాతలు రూ.12 లక్షలు ఆర్థిక సాయం అందించటంతో సత్వరం నిర్మాణం పూర్తయ్యిందన్నారు. రాష్ట్రప్రజల ఆకాంక్షకు అనుగుణంగా డబుల్ ఇంజన్ సర్కార్ దూసుకెళ్తోందన్నారు. గడిచిన ఐదేళ్లలో జగన్‌రెడ్డి అభివృద్ధిని విస్మరించారని ఆరోపించారు. కూటమిప్రభుత్వం అధికారంలోకి వచ్చాక అటు అమరావతి ఇటు పోలవరంతో పాటు గ్రామీణ ప్రాంతాలు సైతం అభివృద్ధి చెందుతున్నాయన్నారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు కొర్సపాటి శ్రీరామచంద్రరావు, నియోజకవర్గ మహిళా అధ్యక్షురాలు కాకర్ల రామ తులసి, వేలచింతలగూడెం గ్రామ కమిటీ అధ్యక్షుడు ఇల్లూరి రామ, సీనియర్ నాయకులు కోర్సపాటి అన్నవరం, కొడవటి సూరిబాబు, మురళీ, జనసేన ఇన్‌చార్జి సువర్ణరాజు, జ్యేష్ఠ శ్రీధర్, బీజేపీ మండల అధ్యక్షుడు వెంకటేశ్వరావు, బాలు, టీడీపీ నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.


చెరుకుమిల్లిలో ఎన్టీఆర్ విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే , తదితరులు

జ్యోతిరావు పూలేకు నివాళి


నిడదవోలులో పూలే విగ్రహానికి నివాళి అర్పిస్తున్న ప్రజాసంఘాల నాయకులు

నిడదవోలు, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): విప్లవ యోధుడు, స్త్రీ సమానత్వాన్ని సాధించాలంటే చదువు ఒక్కటే మార్గమని భావించిన వ్యక్తి మహాత్మా జ్యోతిరావు పూలే అని కేవీపీఎస్ రాష్ట్ర నేత జువ్వల రాంబాబు అన్నారు. శుక్రవారం నిడదవోలు పట్టణంలో జ్యోతిరావుపూలే వర్ధంతిని పురస్కరించుకుని ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భార్య సావిత్రీబాయి పూలేకు చదువు నేర్పి సమాజంలో మూఢత్వాన్ని ఛేదించిన మహనీయుడని కొనియాడారు. ఊల్లూరి సతీష్, తాడేపల్లి రాజన్ బాబు, పి.సత్తిబాబు, మంగన్న, అంబటి పుల్లారావు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌కు పూర్వవైభవం తేవాలి

● పార్టీ జిల్లా అధ్యక్షుడు విశ్వేశ్వరరెడ్డి


సమావేశంలో మాట్లాడుతున్న విశ్వేశ్వరరెడ్డి

నిడదవోలు, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీకి పూర్వ వైభవం తీసుకురావడానికి నాయకులు, కార్యకర్తలు కృషిచేయాలని ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు టీకే విశ్వేశ్వరరెడ్డి అన్నారు. శుక్రవారం నిడదవోలు పట్టణంలోని పార్టీ కార్యాలయంలో ముఖ్య నాయకుల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా పార్టీ జిల్లా అబ్జర్వర్ అంబా ప్రసాద్ మాట్లాడుతూ పార్టీని గ్రామ స్థాయి నుంచి బలోపేతం చేయాలన్నారు. సమావేశంలో నిడదవోలు నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ కోఆర్డినేటర్ మేడపాటి భద్రం దొర, రాష్ట్ర కార్యదర్శి చిన్నం మురళీకృష్ణ, దారపురెడ్డి సుజాత, అగర్వాల హీరాలాల్, షేక్ జబీర్, మహ్మద్ అన్వర్‌ఖాన్, తదితరులు పాల్గొన్నారు.

ఆర్థిక సాయం అందజేత


కొవ్వూరుపాడు హైస్కూల్‌లో సాయం అందిస్తున్న ఉపాధ్యాయులు

గోపాలపురం, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): జిల్లా ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత కొయ్య శ్రీనివాసరావు ఇటీవలే గుండె సంబంధిత వ్యాధితో బాధపడుతూ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. ఆయనకు గుండె మార్పిడి ఆపరేషన్ చేయడానికి సుమారు రూ.40 లక్షల వరకు ఖర్చవుతుందని వైద్యులు తెలిపారు. దీంతో సమాచారం తెలుసుకున్న ఆల్లూరి కుటుంబీకులు జిల్లా పరిషత్ హైస్కూల్ కొవ్వూరుపాడు ఉపాధ్యాయులు తమవంతు సాయంగా రూ.24,500, బుంగ ధారిటబుల్ ట్రస్టు విద్యార్థులను కోరగా వారంతా రూ.33 వేలు సేకరించారు. దీంతో సొమ్ము మొత్తం రూ.57,500 ఆయన బార్యకు శుక్రవారం అందజేశారు. కార్యక్రమంలో టీచర్లు శ్రీపాద బ్రహ్మాజీ, బుంగం ధారిటబుల్ అధినేత జాలిపర్తి కృష్ణ తదితరులు ఉన్నారు.

మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణ నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలి

కొవ్వూరు, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం కొత్త మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణ నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని వైసీపీ జిల్లా అధ్యక్షుడు చెల్లుబోయిన వేణుగోపాల కృష్ణ అన్నారు. శుక్రవారం కొవ్వూరు నియోజకవర్గ వైసీపీ కార్యాలయంలో మాజీ ఎమ్మెల్యే తలారి వెంకట్రావు ఆధ్వర్యంలో సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2014-19 మధ్య వైసీపీ ప్రభుత్వంలో స్థాపించిన కొత్త మెడికల్ కాలేజీలను ప్రైవేటు సంస్థలకు అప్పగించాలన్న ప్రభుత్వ నిర్ణయాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తున్నామన్నారు. కోమారి శివరామకృష్ణ, యువజన విభాగం జిల్లా అధ్యక్షుడు కంటమణి రమేష్, పరిమి సోమరాజు, ఏలూరి విజయలక్ష్మి, కవల నాగేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

మృత్యువుతో పోరాడుతూ యువకుడి మృతి

గోపాలపురం, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): రామన్నపాలెం సమీపంలోని జాతీయ రహదారిపై ఈనెల 18న రోడ్డుప్రమాదం జరిగిన విషయం తెలిసిందే. దీంతో ఇద్దరు యువకులు ప్రమాదానికి గురయ్యారు. అందులో వాడాలకుంటకి చెందిన కొమరం చిలి సుభాష్ (19) అక్కడికక్కడే మృతి చెందగా, తోటి యువకుడు వెదుళ్లకుంటకి చెందిన పులిదింది మణికుమార్ (19)కు తీవ్ర గాయాలు కావడంతో మెరుగైన వైద్యం కోసం రాజమండ్రి ఆసుపత్రికి తరలించారు. కాగా, 18 రోజులపాటు మృత్యువుతో పోరాడి గురువారం సాయంత్రం మణికుమార్ కూడా తుది శ్వాస విడిచాడు.

సత్యదేవుని సన్నిధిలో ఎన్టీఆర్ ఆరోగ్య వర్సిటీ వీసీ


స్వామివారి దర్శనానంతరం ఉప కులపతి చంద్రశేఖర్ కుటుంబీకులు

అన్నవరం, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): రత్నగిరివాసుడైన సత్యదేవుని సన్నిధికి శుక్రవారం ఎన్టీఆర్ ఆరోగ్య విశ్వవిద్యాలయం ఉప కుల పతి డాక్టర్ పి.చంద్రశేఖర్ విచ్చేశారు. కుటుంబసభ్యులతో కలిసి స్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. అధికారులు ఆలయ మర్యాదలతో స్వాగతం పలకగా పండితులు వేదాశీర్వచనం అందజేశారు. అన్నవరం దేవస్థానంలో ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్న నిత్యాన్నదాన పథకానికి చెన్నయ్‌కు చెందిన రావూరి శ్రీసాయి సత్య త్రావ్య రూ.1,01,116 విరాళం సమర్పించారు. కుటుంబ సభ్యులతో కలిసి ఈ మొత్తాన్ని ఏఈవో శ్రీనివాస్, సీఆర్వో అనపల్లి ప్రసాద్‌కు అందజేశారు. దాతను వారు అభినందించి స్వామివారి ప్రసాదం ఇచ్చారు.

త్రీఎఫ్ ఆయిల్ పామ్ కంపెనీ ఉదారత

● కాలినడకన ద్వారకాతిరుమలకు వెళ్లే భక్తులకు వసతి, అల్పాహారం ఏర్పాటు

నల్లజర్ల, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): ద్వారకాతిరుమల వెంకన్న సన్నిధికి కాలినడకన వచ్చే భక్తులు విశ్రాంతి తీసుకునేందుకు గాను వసతి, తాగునీరు, అల్పాహారం ఏర్పాట్లు ప్రతి రోజూ అందిస్తున్నట్టు త్రీఎఫ్ ఆయిల్ పామ్ కంపెనీ సీఈవో ఆశిష్ గోయంకా పేర్కొన్నారు. శుక్రవారం సాయంత్రం ఆయ్యవరం త్రీఎఫ్ ఆయిల్ పామ్ కంపెనీ వద్ద భక్తులకు వసతి ఏర్పాటు చేసి అల్పాహారాన్ని అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రూ. మా దులక్షలు ఖర్చు చేసి వసతి, తాగు నీరు ఏర్పాటు చేశామన్నారు. ప్రతి ఏటా భక్తుల సౌకర్యార్థం రూ. 15 లక్షలు ఖర్చు చేయడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో జనరల్ మేనేజర్లు వెంకట రామయ్య, రామకృష్ణ, కిలారు శ్రీనివాస్, విజయప్రసాద్, హనుమాన్, నరేంద్ర రెడ్డి, వడ్ల మూడి శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు. భక్తులకు సకల సౌకర్యాలు కల్పించడంపై స్థానికులు త్రీఎఫ్ ఆయిల్‌పామ్ యాజమాన్యాన్ని అభినందిస్తున్నారు.


భక్తులకు అల్పాహారం అందిస్తున్న సీఈవో ఆశిష్ గోయంకా

131 కిలోల గంజాయి పట్టివేత... ఇద్దరి అరెస్టు


నిందితులు, వ్యాన్‌ను స్వాధీనం చేసుకున్న పోలీసులు

నల్లజర్ల, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): కేడీ పేట సమీపంలోని కాకరపాడు ఏజెన్సీ ఏరియా నుంచి 131 కిలోల గంజాయి తీసుకుని వస్తున్న ఇద్దరి నిందితులను శుక్రవారం పట్టుకుని అరెస్ట్ చేసినట్టు నల్లజర్ల సీఐ రాంబాబు పేర్కొన్నారు. వ్యాన్‌లో గంజాయి తరలిస్తున్నట్టు సమాచారం రావడంతో తాడేపల్లిగూడెం నుంచి నల్లజర్ల వచ్చే మార్గంలో వాహనాలు తనిఖీ చేస్తుండగా, ఏపీ 31టీపీ 5142 నెంబరు గల బొలెరో వాహనంలో ప్లాస్టిక్ సంచుల్లో తరలిస్తున్నట్టు గుర్తించారు. అలాగే వాహనంతో పాటు సత్య సాయి పుట్టపర్తి జిల్లా గోరంట్ల మండలం మంగాలపల్లికి చెందిన తలారి ఆనంద్, మరో వ్యక్తి ఆదే జిల్లాకు చెందిన పూల మనోహర్‌ను అరెస్ట్ చేశారు. వీరిలో పూల మనోహర్‌పై పలు పోలీస్‌స్టేషన్లలో కేసులు నమోదైనట్టు పోలీసులు తెలిపారు. ముఠాను ఎస్పై దుర్గాప్రసాద్, సిబ్బంది చాకచక్యంగా పట్టుకున్నారని, వారిని ఎస్పీ నరసింహకిషోర్, డీఎస్పీ దేవకుమార్ అభినందించారు.

సివిల్స్ పరీక్షలకు విజయవాడలో ఉచిత శిక్షణ

కలెక్టరేట్ (కాకినాడ), నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలో బీసీ, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు సివిల్స్ పరీక్షల కు విజయవాడలో ఉచిత శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నట్టు వెనుకబడిన తరగతుల సంక్షేమ సాధికారిత అధికారిణి ఎం.లల్లీ తెలిపారు. శుక్రవారం ఆమె ఈ మేరకు ఒక ప్రకటన విడుదల చేశారు. అర్హత కలిగిన అభ్యర్థులు డిసెంబరు 3వ తేదీలోపు వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ కార్యాలయం, ప్రగతి భవనం, రెండో అంతస్తు, డీఆర్‌పి కాంప్లెక్స్, కాకినాడలో దరఖాస్తు చేయాలన్నారు. వారికి డిసెంబరు 7న స్క్రీనింగ్ పరీక్ష నిర్వహిస్తామన్నారు. ఉత్తీర్ణులైన వారికి మెరిట్ ఆధారంగా విజయవాడలో శిక్షణ ఇస్తారన్నారు. బీసీలకు 66శాతం, ఎస్సీలను 20 శాతం, ఎస్టీలను 14శాతం రిజర్వేషన్ ప్రాతిపదికన ఎంపిక చేస్తారన్నారు. సివిల్స్ ప్రిలిమనరీ, మెయిన్స్ పరీక్షలకు దరఖాస్తు చేసే అభ్యర్థులు తమ బయోడేటాతో పాటు పదో తరగతి, ఇంటర్, డిగ్రీ మార్కులిస్టులు, కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాలు, ఆధార్, బ్యాంకు పాస్ పుస్తకాలు, రెండు పాస్‌పోర్టు సైజు ఫోటోలను కాకినాడలో ఉన్న వెనుకబడిన తరగతుల సంక్షేమ అధికారి కార్యాలయంలో అందజేయాలన్నారు. ఇతర వివరాలకు 0884-2379216, 8008121321 నెంబర్లలో సంప్రదించాలన్నారు.

'పాడా' ఇన్‌చార్జి పీడీగా శ్రీనివాసరావు

కలెక్టరేట్ (కాకినాడ), నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): పిఠాపురం ప్రాంత ప్రాధికార అభివృద్ధి సంస్థ (పాడా) ఇన్‌చార్జి ప్రాజెక్టు డైరెక్టర్‌గా శ్రీనివాసరావును నియమించినట్టు సమాచారం. ఇప్పటివరకు ఇన్చార్జి గ్రామీణ విస్తరణ శాఖ కమిషనర్ కార్యాలయంలో షెల్ఫ్ క్రెడిట్ విభాగం స్పెషల్ ఆఫీసర్‌గా విధులు నిర్వహిస్తున్నారు. దీంతో బీసీ కార్పొరేషన్ ఈడీ శ్రీనివాసరావుకు ఇన్‌చార్జి బాధ్యతలు అప్పగించనున్నారు.

వజ్రోత్సవ వేడుకల్లో పాల్గొనడం ఆనందదాయకం

● ఎంపీ పురందేశ్వరి ● నిడదవోలులో విజయవంతంగా ముగిసిన ఉత్సవాలు

నిడదవోలు, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి) : ఎంతో చరిత్ర కలిగిన ఆనాటి నిరవద్యపురం నేటి నిడదవోలు పట్టణం వజ్రోత్సవ వేడుకలు జరుపుకోవడం ఎంతో ఆనందదాయకమని రాజమహేంద్రవరం ఎంపీ దగ్గుబాటి పురందేశ్వరి అన్నారు. శుక్రవారం సాయంత్రం నిడదవోలు పట్టణంలోని ఐ లవ్ నిడదవోలు పార్కు వద్ద వజ్రోత్సవ వేడుకల ముగింపు సభ జరిగింది. ముఖ్య అతిథిగా హాజరైన ఆమె మాట్లాడుతూ కేంద్రం సహకారంతో ముఖ్యమంత్రి చంద్రబాబు పరిపాలనాదక్షత, ఉప ముఖ్యమంత్రి పవన్ మార్గదర్శకత్వంలో ఆంధ్రప్రదేశ్ అభివృద్ధి పథంలో ముందుకు సాగుతోందన్నారు. మంత్రి కందుల దుర్గేష్ మాట్లాడుతూ పురపాలక సంఘం ఏర్పాటై 60 ఏళ్లు పూర్తి అయిన సందర్భంగా జరిగిన వజ్రోత్సవ వేడుకలను అద్భుతంగా నిర్వహించారని, నిడదవోలు పట్టణాభివృద్ధికి ఇది శుభసూచకమన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ భూపతి ఆదినారాయణ, కమిషనర్ టేట కృష్ణవేణి, కౌన్సిలర్లు, పలుశాఖల అధికారులు పాల్గొన్నారు.


కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎంపీ పురందేశ్వరి

జిల్లా జట్టుకు క్రీడాకారుల ఎంపిక


ఎంపికైన వాలీబాల్ క్రీడాకారులు

దేవరపల్లి, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): దుద్దుకూరు జడ్పీ హైస్కూల్లో శుక్రవారం ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా వాలీబాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సబ్ జూనియర్, జూనియర్, యూత్, సీనియర్, క్రీడాకారులకు ఎంపిక పోటీలు నిర్వహించారు. ఇందులో 150 మంది క్రీడాకారులు పాల్గొన్నట్టు అసోసియేషన్ కార్యదర్శి గారపాటి రామచంద్రరావు తెలిపారు. దీన్ని రాష్ట్ర కాప్ డైరెక్టర్ పేరం రవీంద్రనాథ్ ప్రారంభించారు. కాగా, ఇందులో గెలుపొందిన క్రీడాకారులు రాష్ట్ర స్థాయిలో జరిగే క్రీడల్లో పాల్గొంటారని చెప్పారు. కార్యక్రమంలో అసోసియేషన్ ట్రెజరర్ ప్రసాద్, వ్యాయామ ఉపాధ్యాయుడు వెంకటేశ్వరరావు, రామ్‌కుమార్, సతీష్, ఓరుగంటి నాగరాజు, తదితరులు పాల్గొన్నారు.

స్కూల్ బస్సులు భద్రతా ప్రమాణాలు కలిగి ఉండాలి


స్కూల్ బస్సులు తనిఖీ చేస్తున్న దేవరపల్లి మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ వెంకటరమణ

దేవరపల్లి, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): ప్రైవేట్ పాఠశాలల బస్సులు ప్రభుత్వ నియమనిబంధనల ప్రకారం ఫిట్‌నెస్ కలిగి ఉండాలని దేవరపల్లి మోటార్‌వెహికల్ ఇన్‌స్పెక్టర్ సీహెచ్ వెంకటరమణ అన్నారు. దేవరపల్లిలో ప్రైవేటు స్కూల్ బస్సులు, కాలేజీ బస్సులను ఆయన శుక్రవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా బస్సుల్లో ఎమర్జెన్సీ ఎగ్జిట్ కిటికీలు ఉండాలని, ఫైర్‌కి సంబంధించిన నియంత్రణ పరికరాలు అందుబాటులో ఉండాలన్నారు. అలాగే బస్సులు నడిపే డ్రైవర్లు తప్పనిసరిగా డ్రైవింగ్ లైసెన్సులు కలిగి ఉండాలని, అన్ని బస్సులకు ఇన్సూరెన్స్ ఎప్పటి కప్పుడు కట్టాలని, బస్సులు పర్మిట్‌లు యథాతథంగా చూసుకోవాలని, వచ్చేనెల 7వ తేదీ వరకు గడువు ఇవ్వడం జరుగుతుందని, ఆ తరువాత బస్సుల్లో ఏ పొరపాటు నియమ నిబంధనలు పాటించకపోయినా ప్రభుత్వ నిబంధనల మేరకు చర్యలు తీసుకోవడం జరుగుతుందని ఆయన హెచ్చరించారు.

ఎస్సీ, ఎస్టీ రీజనల్ వర్కింగ్ ప్రెసిడెంట్‌గా శ్రీనివాసరావు

గోపాలపురం, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): తూర్పుగోదావరి జిల్లా ఎస్సీ ఎస్టీ విద్యుత్ ఉద్యోగుల సంఘం వర్కింగ్ ప్రెసిడెంట్‌గా గోపాలపురం లైన్‌మెన్ చింతలపూడి శ్రీనివాసరావు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. రాజమహేంద్ర వరంలోని ఎస్సీ, ఎస్టీ అసోసియేషన్ ఇంజనీరింగ్ భవనంలో శుక్రవారం ఎన్నికలు నిర్వహించారు. సంఘ రాష్ట్ర కార్యదర్శి సాయి బాబా, రీజనల్ కార్యదర్శిగా వెంకట్రావు ఆధ్వర్యంలో ఎన్నిక జరిగింది. ఈ సందర్భంగా నూతన అధ్యక్షుడు శ్రీనివాసరావు మాట్లాడుతూ విద్యుత్ ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. గతంలో ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్‌గా పనిచేసినట్టు తెలిపారు. ఈ సందర్భంగా పలువురు విద్యుత్ ఉద్యోగులు, ఉన్నతాధికారులు శుభాకాంక్షలు తెలిపారు.


ఎన్నికైన శ్రీనివాసరావు